సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 4-10-2024 15/-




## వక్ఫ్ ఆస్తులకు చిల్లు పెడుతున్న బిల్లు !




## శిక్షకుడిగా ముహమ్మద్ (స)



సహజీవన భావాల పావురాయి
# గీటురాయి
వారపత్రిక

## GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237

Email : geeturaiweekly@gmail.com

Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 40 హైదరాబాద్
శుక్రవారం 4 అక్టోబర్ 2024 రూ.15-00
30 రబీఉల్ అవ్వల్ 1446 హిజ్రీ


**తొలిగీటు**

## అనాథ బిడ్డల తలను (ఆప్యాయంగా) నిమరండి.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**





**నాన్నా... నన్ను మర్చిపోయావా?**

## లోపల...


| | | |
|---|---|---|
| ఇది వివక్ష కాదా? | ...... | 04 |
| యుద్ధం | ...... | 05 |
| దేవుని బెబ్బులి!! – 48 | ...... | 08 |
| వక్ఫ్ ఆస్తులకు చిల్లు పెడుతున్న బిల్లు ! | ...... | 12 |
| అశ్లీలతకు వ్యతిరేకంగా ఓ గొప్ప ఉద్యమం అవసరం-2 | ...... | 14 |
| దైవప్రవక్త (స)ను ప్రేమించండి! | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| పరలోక భావన : ఇస్లాంలో.... | ...... | 20 |
| జ్ఞానజ్యోతిని వెలిగించాలి.... | ...... | 24 |
| శిక్షకుడిగా ముహమ్మద్ (స) | ...... | 28 |
| నిరాడంబరత్వం! | ...... | 31 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| ఏది నిజమైన ఆస్తి? | ...... | 34 |


**విష పవనం...**



పవిత్రమైన ప్రసాదం
పెద్ద తిరుపతి లడ్డు
రాజకీయ మొద్దండీ
విలువలకది అడ్డు!
చేతనైతే విచారించి
తేల్చేయవోయి నిగ్గు
నిజరూపం తెల్సింది
తొలగించవోయి విగ్గు!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

ఆలోచన

# ఇది వివక్ష కాదా?

**బీహారులోని** దర్భంగాలో ఉర్దూ యూనివర్శిటీ నడుపుతున్న ఉర్దూ మీడియం స్కూలు ఉంది. ఆ స్కూలు పేరు కామ్రాన్ మాను మోడల్ స్కూల్. సిబియస్ఇ సిలబసు చదివిస్తారు. కాని విచిత్రమేమిటంటే, ఉర్దూ మీడియంలో చదువుతున్న పిల్లలు ఇప్పుడు ఉర్దూలో పరీక్షలు రాయడం కుదరదు. ఇంగ్లీషులో కాని, హిందీలో కాని రాయాలని సిబియస్ఇ ఆంక్షలు పెట్టింది. ఈ పిల్లలిప్పుడేం చేయాలి? ఉర్దూ మీడియంను ఒప్పుకోనిపక్షంలో ఉర్దూ మీడియం స్కూలును తమ సిలబసులో ఎందుకు తీసుకున్నారు? హిందీలో రాయగలిగినప్పుడు ఉర్దూలో ఎందుకు రాయకూడదు? ఈ ప్రశ్నలకు సముచితమైన సమాధానం బోర్డు ఇవ్వదు.

మే 24వ తేదీన సిబియస్ఇ పరీక్షల విభాగం ఈ ఆదేశాలు జారీ చేసింది. దీనివల్ల కామ్రాన్ మాను మోడల్ స్కూల్లో చదువుతున్న వందలాది మంది పిల్లల చదువు నాశనం అవుతోంది. ఆ ఒక్క స్కూలు మాత్రమే కాదు హైదరాబాద్ ఫలక్‌నుమాలో ఉన్న ఉర్దూ మీడియం స్కూలు, హర్యానా నూహ్‌లో ఉన్న ఉర్దూ మీడియం స్కూలు పిల్లల చదువు కూడా నాశనం చేయడానికి సిబియస్ఈ కంకణం కట్టుకుంది. ఉర్దూ మీడియంలో పరీక్షలు రాయడం కుదరదని చెబుతున్న సిబియస్ఈ అసలు ఉర్దూ మీడియం స్కూళ్ళకు అఫిలియేషన్ ఎందుకు ఇచ్చింది?

పైన చెప్పిన మూడు స్కూళ్ళు ఉర్దూ యూనివర్శిటీ, అంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్ర యూనివర్శిటీ నడుపుతున్న స్కూళ్ళు. 1998లో ఈ యూనివర్శిటీ ఏర్పాటయ్యింది. సిబియస్ఈ ప్రకారం విద్యార్థులు కేవలం హిందీ లేదా ఇంగ్లీషు మీడియంలోనే స్కూలు చదువులు చదివేదయితే, ఉన్నత చదువుల్లో ఉర్దూ మీడియం విద్యార్థులు ఎక్కడి నుంచి వస్తారు. అలాంటప్పుడు ఉర్దూ విశ్వవిద్యాలయం ఏర్పాటు ఎందుకు చేశారు? కేవలం ప్రదర్శన కోసమా?

ఉర్దూ విశ్వవిద్యాలయం దాదాపు 93 కోర్సులు నిర్వహిస్తోంది. ఉర్దూ మీడియంలో ఉన్నత విద్యాభ్యాసానికి అవకాశాలు ఇస్తోంది. ఉర్దూ మీడియంలో స్కూలు పరీక్షలు రాసే అవకాశమే లేకపోతే, ఇక ఉర్దూ విశ్వవిద్యాలయంలో చదవడానికి ఎవరు వస్తారు? పార్లమెంటు చట్టం ప్రకారం ఉర్దూ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన లక్ష్యాన్ని నీరుగార్చే చర్య ఇది.

ఈ వివక్ష ఇప్పటిది కాదు. 2020 వరకు స్కూలు పరీక్షా పత్రాలు ఉర్దూలో వచ్చేవి. కాని ఆ తర్వాత హిందీ లేదా ఇంగ్లీషులో మాత్రమే ప్రశ్నాపత్రాలు ఇవ్వడం ప్రారంభించారు. హిందీ, ఇంగ్లీషు భాషలు తమ సిలబసులో ఎలాగూ పిల్లలు చదువుతారు కాబట్టి హిందీ, ఇంగ్లీషులో ఉన్న ప్రశ్నాపత్రాన్ని అర్థం చేసుకుని ఉర్దూలో రాయడానికి పెద్దగా కష్టపడలేదు. కాని ఇప్పుడు పూర్తిగా జవాబులు హిందీలో కాని, ఇంగ్లీషులో కాని రాయాలని ఆదేశిస్తున్నారు. ఇది అన్యాయం కాదా? ఇది వివక్ష కాదా? ఈ ఉర్దూ మీడియం స్కూళ్ళలో చదివేది ముఖ్యంగా పేదవారి పిల్లలు. ముఖ్యంగా బాలికలు. ఇంగ్లీషులో లేదా హిందీలో రాయాలంటే వాళ్ళు ప్రయివేటు క్లాసులు తీసుకోవాలి. ఆ ఖర్చు భరించగలిగితే ఈ ఉర్దూ మీడియం స్కూలుకు ఎందుకు వస్తారు?

ఈ పిల్లలు ఉర్దూ మీడియంలో చదువుతున్నారని సిబియస్ఈకి ముందే తెలుసు. ఉర్దూ మీడియం స్కూళ్ళుగానే అఫిలియేషన్ ఇచ్చింది. ఉర్దూ మీడియంలో చదివిన విద్యార్థి ఆ మీడియంలో కాదు వేరే భాషలో పరీక్ష రాయాలని చెప్పడం ఎలాంటి మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తోంది? ఇది వివక్ష కాదా?

ఉర్దూను భారతీయ భాషగా ఒప్పుకోవడం చాలా మందికి కష్టంగా ఉంటుంది. అలాంటి మనస్తత్వమే ఈ నిర్ణయానికి కారణం. పిల్లల చదువుతో ఆటలాడుకునే ఇలాంటి చర్యలను నిలదీయవలసిన బాధ్యత ప్రజలపై ఉంది. ఇలాంటి చర్యలను నివారించవలసిన కర్తవ్యం ప్రభుత్వానిది.

అబ్దుల్ వాహెద్




**2023 అక్టోబర్ 7న** ఏం జరిగిందంటూ అమెరికా, ఇస్రాయీల్ అడగడం మామూలే. ఆ రోజు ఇస్రాయీల్ పై హమాస్ దాడి చేసింది. హమాస్ ఎందుకు ఆ దాడి చేసిందన్నది ఇస్రాయీల్‌కు, అమెరికాకు బాగా తెలుసు. ఇప్పుడు ప్రపంచంలో చాలా మందికి తెలుసు. పలస్తీనా సమస్యను అటకెక్కించిన ప్రపంచం ఈ దాడి తర్వాత ఉలిక్కిపడి మేల్కొంది. అటకపై ఉన్న పలస్తీనా సమస్యను క్రిందికి దించక తప్పలేదు. గాజాపై ఇస్రాయీల్ దాడులను నిరసిస్తూ లెబనాన్ నుంచి హిజ్బుల్లా, ఎమన్ నుంచి హూతీ దళాలు ఇస్రాయీల్‌పై దాడులకు దిగుతున్నాయి.

లెబనాన్‌పై ఇస్రాయీల్ వైమానిక దాడుల్లో వందలాది మంది మరణించారు. చనిపోయిన వారిలో అత్యధికులు పిల్లలు, మహిళలే. గాజాపై ఇస్రాయీల్ దాడుల్లో కూడా చనిపోయింది అధికంగా పిల్లలు, మహిళలే. ఇస్రాయీల్ యుద్ధం పేరుతో ఎవరిని చంపుతుందో ప్రపంచం ఇప్పుడు స్పష్టంగా చూస్తోంది. అంతకు ముందు లెబనాన్ లో పేజర్లు, వాకీటాకీలు పేలిపోయే కుట్ర అమలు చేసింది ఇస్రాయీల్. ఈ దాడుల్లో కూడా మరణించింది సగటు ప్రజలే. ఇది స్పష్టంగా ఉగ్రవాద దాడి. దీనిపై ప్రపంచం ఎలా ప్రతిస్పందిస్తుందో చూడాలి. యూరపులోను, తైవాన్‌లోను తయారైన ఎలక్ట్రానిక్ వస్తువులను కొనాలంటే ఇప్పుడు ఒకటికి పదిసార్లు ప్రతి ఒక్కరు ఆలోచించుకోవలసిన అవసరం వచ్చింది. ఈ ఎలక్ట్రానిక్ వస్తువుల వెనుక ఏ ఉగ్రవాద భూతం కోరలున్నాయో ఎవరు చెప్పలేరు. లెబనాన్‌లో పేజర్ పేలుళ్ళ తర్వాత యూరోపియన్ కంపెనీల విశ్వసనీయత పాతాళానికి పతనమయ్యింది. మరోవైపు ఇస్రాయీల్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందించడంలో అమెరికా ఏ మాత్రం వెనకడుగు వేయడంలేదు.

ఇస్రాయీల్ ప్రతిరోజు లెబనాన్‌పై వైమానిక దాడులకు పాల్పడుతూనే ఉంది. విధ్వంసం సృష్టిస్తూనే ఉంది. ఈ దాడుల్లో మరణించేది పిల్లలు, మహిళలు, సాధారణ పౌరులే. కాగా మరోవైపు హిజ్బుల్లా మిలిటెంట్లు కూడా ప్రతిదాడులు చేస్తున్నారు. హిజ్బుల్లా రాకెట్లు ఇస్రాయీల్‌పై విరుచుకుపడుతున్నాయి. టెల్ అవీవ్‌లో ఉన్న ఇస్రాయీల్ గూఢచార సంస్థ మొసాద్ ప్రధాన కార్యాలయాన్ని హిజ్బుల్లా ధ్వంసం చేసింది. విచిత్రమేమిటంటే హిజ్బుల్లా దాడులు ఇస్రాయీల్ సైనికస్థావరాలపై జరుగుతుంటే అమెరికా, దాని మిత్రదేశాలు చాలా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కాని లెబనాన్‌లోను, గాజాలోను పసిపిల్లలను ఇస్రాయీల్ చంపుతున్నా ఈ దేశాలకు పట్టడంలేదు. లెబనాన్‌లో పేజర్ దాడుల వంటి ఉగ్రవాద చర్యల వెనుక మొసాద్ ఉందన్నది బహిరంగ రహస్యం. అలాంటి సంస్థపై రాకెట్ దాడి జరిగితే అమెరికాకు కష్టమనిపిస్తోంది. కాని పేజర్ పేలుళ్ళ వంటి టెర్రరిస్టు చర్యల వల్ల లెబనాన్‌లో పసిపిల్లలు చనిపోతే అమెరికాకు చింత లేదు. ఇస్రాయీల్ వ్యూహాత్మక దాడిగా అమెరికా పత్రికలు కొన్ని పొగడ్డం కన్నా పైశాచికత్వం మరొకటి ఉండదు. ఇలాంటి దాడి ఎక్కడ ఎవరు చేసినా అది ఉగ్రవాదమే అవుతుంది.

లెబనాన్‌లో ఉన్న హిజ్బుల్లా రాకెట్లు ఇస్రాయీల్‌లో ఎక్కడైనా దాడి చేయగలమని నిరూపిస్తున్నాయి. మరోవైపు హూతీల మిస్సైల్‌ను ఆపలేక ఇస్రాయీల్ మాత్రమే కాదు, అమెరికా సైతం చేతులెత్తేసింది. హిజ్బుల్లా ఈ రాకెట్లను ఇస్రాయీల్ ప్రజలను లక్ష్యం చేసుకుని ప్రయోగించి ఉంటే చాలా ప్రాణనష్టం కలిగి ఉండేదే. కాని హిజ్బుల్లా సైనికస్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని పోరాడుతుందన్నది స్పష్టంగా కనిపిస్తోంది.

అమెరికా అబద్దాలు ప్రపంచానికి కొత్త కాదు. ఏదో కెమికల్ ఆయుధాలున్నాయని ఇరాక్‌పై దాడి చేసి లక్షలాది మందిని చంపిన దేశం. అమెరికాలో పన్నులు కడుతున్న వారి డబ్బు ఎక్కడికి పోతుందో అమెరికా ప్రజలే ఆలోచించుకోవాలి.

దక్షిణ లెబనాన్ ప్రజలు ఇస్రాయీల్ దాడులకు, అమెరికా ఇచ్చిన యుద్ధవిమానాలతో వీరంగాలు వేస్తున్న ఇస్రాయీల్ సైన్యం విధ్వంసాలకు తలొగ్గడంలేదు. హిజ్బుల్లా తదితర రూపాల్లో ఇస్రాయీల్ పై ప్రతిదాడులకు దిగుతున్నారు.

గమనించవలసిన విషయమేమిటంటే, పేజర్ దాడుల్లో చనిపోయిన వారు మార్కెటులో కొనుగోళ్ళు చేస్తున్న సగటు ప్రజలు. కేవలం కొద్ది మంది మాత్రమే హిజ్బుల్లా మిలిటెంట్లు ఈ దాడులకు గురయ్యారు. హిజ్బుల్లా సైనికశక్తిపై ఈ పేలుళ్ళ ప్రభావం పెద్దగా లేదన్న విశ్లేషణలు వస్తున్నాయి. హిజ్బుల్లా దళాల్లో లక్ష మంది ఉన్నారని అంచనా. కాని ఈ పేజర్ దాడుల తర్వాత హిజ్బుల్లా నుంచి వెనక్కు తగ్గిన మిలిటెంట్లు మళ్ళీ హిజ్బుల్లా పంక్తుల్లోకి వస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటి వరకు హిజ్బుల్లా పోరాడుతోంది గాజాకు సంఘీభావ పోరాటం. కాని ఇప్పుడు లెబనాన్ ప్రజలకు ఇది తమ స్వంత పోరాటంగా మారిపోయింది. హిజ్బుల్లా పంక్తుల్లో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతోందని తెలుస్తోంది. మరో ముఖ్యమైన విషయమేమిటంటే, లెబనాన్‌లో క్రయిస్తవులు, సున్నీ ముస్లిములు, షియా ముస్లిములు ఉన్నారు. వీరి మధ్య విభేదాలు ఉన్నాయి. కాని పేజర్ దాడుల తర్వాత అందరూ ఒక్కటయ్యారు. రక్తదానం చేయడానికి ఆసుపత్రుల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారని, కొందరు నేత్రదానం, తాము బతికుండగానే తమ ఒక కన్ను తీసి కళ్ళు కోల్పోయిన వారికి ఇవ్వాలని అడుగుతున్నారని కూడా కొన్ని వార్తలు చెబుతున్నాయి. పేజర్ దాడుల తర్వాత ప్రపంచం మారిపోయింది. యూరోపియన్ కంపెనీలు తయారు చేసిన ఎలక్ట్రానిక్ పరికరం జేబులో పెట్టుకోవాలంటే ఏ దేశం ప్రజలైనా భయపడే వాతావరణం నెలకొంది.

హిజ్బుల్లా కేవలం ఇస్రాయీల్‌తోనే పోరాడుతోందని అనుకుంటే పొరబాటు. ప్రపంచం వ్యాప్తంగా భయాందోళనలు సృష్టించిన ఐసిస్‌ను తుదముట్టించింది అమెరికా కాదు, హిజ్బుల్లాయే. ఈ వాస్తవం అమెరికాకు, ఇస్రాయీల్‌కు బాగా తెలుసు. లెబనాన్‌లో ఐసిస్‌ను హిజ్బుల్లా తుడిచిపెట్టేసింది. ఇస్రాయీల్ గొప్పగా చెప్పుకుని ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేసుకున్న ఐరన్ డోమ్‌ను పేకమేడలా కుప్ప కూల్చింది. పేజర్ పేలుళ్ళ దాడులు చేయడానికి సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధం లేదు. పేజర్లు తయారు చేసిన కంపెనీల్లో కుట్రలు పన్ని పేలుడు పదార్థాలు పేజర్లలో పెట్టించడంలో నేరమనస్తత్వం తప్ప మరొకటి లేదు. ఈ పని ఇప్పుడు మొసాద్ చేయిస్తే, రేపు మరొకరు చేయిస్తారు. దీన్ని యుద్ధవ్యూహంగా నేడు పొగుడుతున్న వారు అప్పుడేం చేస్తారు? ఇక సాంకేతిక పరిజ్ఞానం విషయానికి వస్తే, ఐరన్ డోమ్ రేకుల షెడ్డు కన్నా ఎక్కువ కాదని ఇప్పటికే పలుమార్లు నిరూపించారు. హిజ్బుల్లా డ్రోన్ ఇస్రాయీల్ పై చక్కర్లు కొట్టి చాలా సేపు ఆకాశంలో విహరించి, అవసరమైన ఫోటోలు తీసుకుని తిరిగి లెబనాన్ వెళ్ళిపోయినా ఇస్రాయీల్ ఏమీ చేయలేక పోయిందన్న వార్త కూడా వచ్చింది. సాంకేతికంగా పైచేయి మాదేనని చెప్పుకునే ఇస్రాయీల్ దీనికి ఏం సమాధానమిస్తుంది? సాంకేతిక పరిజ్ఞానం ఎవరి స్వంతమూ కాదు. 2006లో ఏం జరిగింది? ఇస్రాయీల్ అప్పుడు కూడా హిజ్బుల్లాతో యుద్ధం చేసింది. దారుణ పరాభవం తప్పలేదు. అప్పుడు కూడా ఇస్రాయీల్ చంపింది సాధారణ ప్రజలనే. అప్పుడు ఇస్రాయీల్‌తో పోరాడిన దక్షిణ లెబనాన్ ప్రజల పిల్లలే ఇప్పుడు ఇస్రాయీల్‌తో మరో పోరాటం చేస్తున్నారు.

ఇస్రాయీల్ సైన్యం లెబనాన్ భూభాగాల్లోకి ప్రవేశించే పొరబాటు 2006లోను చేసింది. అప్పుడు కూడా తలబొప్పి కట్టింది. ఇప్పుడు మరోసారి చేయబోతోంది. నిజం చెప్పాలంటే ఇస్రాయీల్ సైన్యం లెబనాన్‌లోకి ఎప్పుడు అడుగుపెడుతుందా అని హిజ్బుల్లా ఎదురు చూస్తున్నట్లు కనిపిస్తోంది. ఎందుకంటే లెబనాన్‌లో ప్రవేశించిన తర్వాత నిజమైన యుద్ధంలో ఇస్రాయీల్ సైన్యం బలమేమిటో హిజ్బుల్లాకు బాగా తెలుసు. గాజాలో ఇస్రాయీల్ సైన్యం చిన్నపాటి, బలహీనమైన హమాస్ ముందే నిలవలేకపోతోంది. హిజ్బుల్లాను నిలువరించడం సాధ్యమా? పైగా ఇరాక్‌లోని కొన్ని దళాలు కూడా లెబనాన్‌లోకి ఇస్రాయీల్ సైన్యం వస్తే హిజ్బుల్లాకు మద్దతుగా లెబనాన్ వచ్చి పోరాడుతామని ప్రకటించారు. ఎమన్ నుంచి హూతీలు, సిరియన్లు, ఇరానీలు ఈ దళాలు రోజు యుద్ధాన్ని చూస్తూ వస్తున్న దళాలు. వీళ్ళందరు లెబనాన్ వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.

ఎనభయ్యో దశకంలోను ఇస్రాయీల్‌కు వ్యతిరేకంగా లెబనాన్ పోరాడింది. అప్పుడు హిజ్బుల్లా లేదు. అప్పట్లో కూడా లెబనాన్‌లోని క్రయిస్తవ, ముస్లిం ప్రజలు, మహిళలు కూడా ఇస్రాయీల్ పై వీరోచితంగా పోరాడారు. హిజ్బుల్లా తర్వాత వచ్చింది. సిరియాలో కాని, లెబనాన్‌లో కాని, ఐసిస్‌తో యుద్ధంలో కాని, హిజ్బుల్లా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఓడిపోయిన యుద్ధమంటూ లేదు. గాజా కోసం హిజ్బుల్లా ప్రారంభించిన పోరాటం చివరకు లెబనాన్ నెత్తిమీదికి వచ్చిందని, హిజ్బుల్లాకు లెబనాన్‌లో ప్రజాదరణ తగ్గిపోతోందన్న విశ్లేషణలు పాశ్చాత్య మీడియా చేస్తోంది. కాని వాస్తవాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. లెబనాన్ పార్లమెంటులో అత్యధిక మెజారిటీతో గెలుపొందిన వ్యక్తి ముహమ్మద్ రాద్. లెబనాన్ పార్లమెంటులో హిజ్బుల్లా గ్రూపుకు నాయకుడు. ఆయన కుమారుడు హిజ్బుల్లా దళాలతో కలిసి పోరాడుతూ మరణించాడు. నిజం చెప్పాలంటే ఇస్రాయీల్ ఈ హత్య చేయించింది. ముహమ్మద్ రాద్‌కు ప్రజల్లో ఆదరణ ఎంతగా ఉందంటే అత్యధిక మెజారిటీతో గెలిచాడు.

ఇస్రాయీల్ గాజాపై సైనికచర్య ప్రారంభించిన తర్వాతి నుంచి

అంటే 2023 అక్టోబర్ 8 నుంచి హిజ్బుల్లా ఇస్రాయీల్‌పై దాడులు చేస్తోంది. గాజా నుంచి వైదొలిగే వరకు దాడులు కొనసాగిస్తామని నిర్ద్వం ద్వంగా చెప్పింది. ఇస్రాయీల్‌తో హిజ్బుల్లా తలపడడం ఇదే మొదటి సారి కాదు. హిజ్బుల్లాను అణిచేయాలని ప్రయత్నించి భంగపడడం ఇస్రాయీల్‌కు కూడా ఇది మొదటిసారికాదు. 1982లో ఇస్రాయీల్ లెబనాన్‌పై దాడి చేసింది. అప్పటికి ఏడేళ్ళుగా లెబనాన్‌లో అంతర్యుద్ధం జరుగుతోంది. లెబనాన్‌లో కీలుబొమ్మ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఇస్రాయీల్ ప్రయత్నించింది. లెబనాన్‌లో దారుణమైన హత్యాకాండలకు పాల్పడింది. ఇస్రాయీల్‌ను ప్రతిఘటించడానికి అనేక ప్రతిఘటన దళాలు ఏర్పడ్డాయి. షియా ముస్లిముల ప్రతిఘటన దళంగా హిజ్బుల్లా ఏర్పడింది. ఈరాన్ మద్దతు ఈ దళానికి లభించిందని ప్రచారం. 1983 తర్వాతి నుంచి ఇస్రాయీల్ సైన్యంపై హిజ్బుల్లా దాడులు ప్రారంభించింది. కేవలం ఇస్రాయీల్ సైనిక స్థావరాలపైనే కాదు లెబనాన్‌లో ఉన్న విదేశీ సైన్యంపై దాడులు జరిగాయి. అమెరికా, ఫ్రాన్స్ తదితర దేశాలకు చెందిన సైన్యాలపై కూడా హిజ్బుల్లా దాడులు చేసింది. నెమ్మదిగా హిజ్బుల్లా బలం పుంజుకుంది. 1985 నాటికి హిజ్బుల్లా దళాల దాడులతో ఇస్రాయీల్ దక్షిణ లెబనాన్ నుంచి సైన్యాన్ని వెనక్కి తీసుకోక తప్పలేదు. చివరకు 2000 సంవత్సరంలో ఇస్రాయీల్ పూర్తిగా లెబనాన్ నుంచి వెనక్కు మళ్ళింది. 1992లో అంటే అంతర్యుద్ధం తర్వాత హిజ్బుల్లా రాజకీయపార్టీగా పార్లమెంటు ఎన్నికల్లో పాల్గొంది. 128 మంది సభ్యులున్న లెబనాన్ పార్లమెంటులో హిజ్బుల్లా మిత్రపక్షాలకు 62 సీట్లున్నాయిప్పుడు. 1993లో మరోసారి ఇస్రాయీల్ లెబనాన్ పై దాడికి దిగింది. ఏడు రోజుల పాటు ఈ దాడులు జరిగాయి. 1996లో 17 రోజుల పాటు ఇస్రాయీల్ దాడులకు దిగింది. అప్పుడు కూడా ఇస్రాయీల్‌కు భారీ మూల్యం చెల్లించుకోవలసి వచ్చింది. 2006లో ఇస్రాయీల్ సైన్యం లెబనాన్‌పై దురాక్రమణకు ప్రయత్నించింది. కాని తలబొప్పి కట్టే ఎదురుదెబ్బలు తగిలాయి. 2012లో సిరియా అంతర్యుద్ధంలో సిరియా ప్రభుత్వానికి మద్దతుగా హిజ్బుల్లా రంగంలోకి దిగింది. ఐసిస్‌ను సిరియా నుంచి తుడిచి పెట్టేసింది. హిజ్బుల్లా యుద్ధాల్లో కాకలు తీరిన దళమన్నది స్పష్టంగా తెలుస్తోంది.

నెతన్యాహు తన వైఫల్యాలను కప్పిపుచ్చడానికి లెబనాన్ పై యుద్ధానికి దిగుతున్నాడు. హమాస్‌ను తుడిచిపెట్టేస్తానన్నాడు. సాధ్యం కాలేదు. హమాస్ వద్ద బందీలుగా ఉన్న ఇస్రాయీల్ పౌరులను విడిపిస్తానన్నాడు. సాధ్యం కాలేదు. పైగా ఇస్రాయీల్ సైన్యం వీరోచితంగా పోరాడి విడిపించిన హమాస్ బందీగా చెప్పుకున్న వ్యక్తి తర్వాత అదంతా అబద్ధమని, హిజ్బుల్లా దళాలే తన పరిస్థితి చూసి జాలిపడి వదిలేశాయని, అస్సలు ఇస్రాయీల్ సైన్యం అక్కడెక్కడా లేదని చెప్పాడు.

ఏడాది క్రితం హిజ్బుల్లా ఇస్రాయీల్‌పై దాడులు ప్రారంభించినప్పుడు దాదాపు 60 వేల మంది ఉత్తర ఇస్రాయీల్ ప్రాంతం నుంచి తమ ఇళ్లు ఖాళీ చేసి సురక్షిత ప్రదేశాలకు వెళ్ళవలసి వచ్చింది. అమెరికాతో సహా అనేక దేశాలు హిజ్బుల్లాను ఉగ్రవాద సంస్థగా నిర్ధారించాయి. హమాస్‌తో యుద్ధం ప్రారంభించిన నెతన్యాహు సాధించింది పిల్లలను, మహిళలను వేలాది మందిని చంపడం తప్ప మరేమీ లేదు. ఒక్క బందీని కూడా విడిపించలేకపోయాడు. హమాస్ బలమూ తగ్గలేదు. ప్రజల దృష్టిని మళ్ళించడానికి ఇప్పుడు హిజ్బుల్లాతో పూర్తి స్థాయి యుద్ధం ప్రారంభిస్తున్నాడు.

హిజ్బుల్లా దాడులు గాజా కోసం చేస్తోంది. గాజాలో యుద్ధమాగిపోతే హిజ్బుల్లా దాడులు కూడా ఆగిపోతాయి. ఈ రెండింటి మధ్య సంబంధం విషయంలో హిజ్బుల్లా స్పష్టంగా సందేశమిచ్చింది. గాజాలో యుద్ధం వేరు, లెబనాన్‌లో యుద్ధం వేరు అనే కొత్త వాదన, చర్చ ప్రారంభమయ్యేలా చేస్తే, గాజాలో వైఫల్యాలను కప్పిపుచ్చుకోవచ్చునేది నెతన్యాహు ఆలోచన. గాజాలో నెతన్యాహు కాల్పుల విరమణ తన షరతులపై ఒప్పించాలనుకున్నాడు. సాధ్యం కాలేదు. హిజ్బుల్లాతో కాల్పుల విరమణ కూడా సాధ్యం కాలేదు. కాగా ఇప్పుడు హమాస్, హిజ్బుల్లా, హూతీల మధ్య సంబంధాలు మరింత బలపడ్డాయి.

ఇస్రాయీల్ ప్రజలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు. యుద్ధ విరమణ, బందీల విడుదల కోసం ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్తర ఇస్రాయీల్‌లో ప్రజలకు హిజ్బుల్లా నుంచి రక్షణ కల్పించడం ద్వారా తన పలుకుబడి కొంత పెంచుకోవచ్చన్నది నెతన్యాహు వ్యూహం. హిజ్బుల్లా దాడుల వల్ల ఇప్పటికే లక్షకు పైగా ఇస్రాయీలీలు ఉత్తర ఇస్రాయీల్ ఖాళీ చేశారు. కాని ఒకవైపు గాజా ఊబి నుంచి బయటపడలేని ఇస్రాయీల్ కొత్తగా లెబనాన్ ఊబిలోకి దిగితే ఏమవుతుంది? ఇస్రాయీల్ రక్షణమంత్రి గాలంట్‌కు గాజాలో యుద్ధం ఇంకా కొనసాగించడం ఇష్టంలేదు. కాని నెతన్యాహుకు యుద్ధం అవసరం. అవినీతి ఆరోపణలు, వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్ళించడానికి యుద్ధం ఉపయోగపడుతుంది. కాని హిజ్బుల్లాతో యుద్ధానికి దిగితే ఈసారి ఇస్రాయీల్ భారీ మూల్యం చెల్లించుకునే పరిస్థితి రావచ్చని పలువురు భావిస్తున్నారు. ముఖ్యంగా హూతీలు కూడా రంగంలో ఉండడంతో పాటు, ఈరాన్, ఇరాక్‌కు చెందిన అనేక గ్రూపులు బాహాటంగా హిజ్బుల్లాకు మద్దతు ప్రకటించడం గమనించదగిన విషయం. ఇస్రాయీల్‌కు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సహాయం చేస్తున్న సౌదీ, జోర్డన్ తదితర అరబ్బు దేశాలతో పాటు టర్కీ కూడా ఇస్రాయీల్‌కు వ్యతిరేకంగా నిలబడవచ్చు. రష్యా, చైనాలు ఈ అవకాశాన్ని అమెరికాను దెబ్బ తీయడానికి ఉపయోగించుకోవచ్చు. ఈ సమీకరణాల మధ్య హమాస్ పోరాటం మరింతగా చర్చలోకి రావడం, పలస్తీనా సమస్యపై చర్చ జరగడం తథ్యమని పలువురి విశ్లేషణ.

యుద్ధాలు కేవలం విధ్వంసాన్ని మాత్రమే సృష్టిస్తాయి. యుద్ధవిరమణ త్వరగా జరగాలని కోరుకుందాం. ✤

అధ్యాయం -18

48

# 1. జ్ఞాన ఖని!

# దేవుని బెబ్బులి!!

ఎస్.ఎమ్. మలిక్

## 1. గడ్డుకాలం మొదలు

### మహనీయ ఉస్మాన్(ర) కాలంలో

ఖలీఫా ఉస్మాన్(ర) ఖిలాఫత్, మహనీయ ఉమర్(ర) అమర గతి పొందిన తరువాత హిజ్రీ 23వ ఏట జుల్ హిజ్జా చివరి తేదీల్లో ఉనికిలోకి వచ్చింది. మహనీయ ఉస్మాన్(ర) తో కూడా మహనీయ అలీ(ర) సంబంధాలు సుహృద్భావ పూర్వ కంగా ఉండటమే కాక పాలనా వ్యవహారాల్లో ఖలీఫాకు ఆయన కుడి భుజంగా రూపొందారు. ఖలీఫా ఆయనకు ముఖ్యమయిన బాధ్యతల నప్పగించారు. ఆయన సలహా లను ప్రముఖ మయినవిగా భావించేవారు.

షరీఅత్ ఆదేశాలను అన్వయించి అమలుపరిచే అధికారం అలీకే ఇచ్చారు ఆయన. న్యాయస్థానం విధించిన శిక్షను అమలు పరచడం ఆయన ద్వారానే జరిగేది. ప్రవక్త మహ నీయుని కాలంలోనూ ఈ బాధ్యతను నిర్వహించడానికి కేవలం మహనీయులు అలీ, జుబైర్, ముహమ్మద్ బిన్ ముస్లిమ నియుక్తులయి ఉండేవారు. ఈ బాధ్యతలే కాక ప్రతి సంవత్సరం అధికారికంగా హజ్జ్‌కు వెళ్ళేవారు. ఇంకా ఆఫ్రికా ఖండంలో ఉత్తర భాగాన గల లిబియా, టునీషియా మొదలయిన ప్రదేశాల విజయంలో ఇతర సహచర మాన్యు లతోపాటు మహనీయ అలీ(ర) సలహా ప్రధానమయింది.

అరబీ భాష మాటలాడే వారి యాసల్లో ప్రాంతాల వారీగా వ్యత్యాసముండేది. వారు దివ్యకుర్‌ఆన్‌ని పఠించేటప్పుడు తమ తమ యాసల్లో పఠించేవారు. అలా కాక ఒకే పఠనాన్ని స్థిర పరిచేందుకు సహచరమాన్యుల ఓ సమావేశం ఏర్పరి చారు మహనీయ ఉస్మాన్(ర). వారిలో ప్రప్రథమ వ్యక్తి మహనీయ అలీ(ర). అందరూ కలసి ఎన్నో చర్చలు అధ్యయ నాలు జరిపారు. కడకు హిజాజ్ (మక్కా, మదీనా ప్రాంతం) లోని యాస పఠనం పట్ల ఏకీభావం కుదిరింది. కుర్‌ఆన్ పారాయణం ఇక నుంచి ఆ ఒక్క పఠన విధానంలోనే జరగాలని నిర్ణయమయింది.

మహనీయ ఉస్మాన్(ర) చివరి రోజుల్లో ఇస్లామ్ విరోధులు సముదాయంలో విభేదాలు సృష్టించినప్పుడు మహనీయ అలీ(ర) ఉపద్రవ స్రష్టలను బోధపరచి సన్మార్గాన వేయాలని బహుధా అనేక ప్రయత్నాలు చేశారు. ఆ సందర్భంలో తన సంతానాన్ని అమీరుల్ మూ'మినీన్‌ని రక్షించేందుకు పంపారు కూడా. ఆ దుఖ దాయకమయిన ఉపద్రవ పరీక్షలో

ఆయన ఖలీఫాకు తోడుగా అతి సమీపంలో ఉండేవారు. ఖలీఫా ఇంటికి త్రాగే నీరు కూడా చేరనివ్వకుండా ఉపద్రవ కారకులు ఎంత అడ్డుకున్నా గాయాలకు వెరవకుండా ఏదో విధంగా ఖలీఫా ఇంటికి నీరు చేర్చగలిగారు.

ఆ రోజుల్లోనే ఒక సందర్భంలో మహనీయ అలీ, తన వద్ద అయిదు వందల మంది కవచ ధారులు ఉన్నారు దౌర్జన్య పరులకు ఎదురుగా ఖలీఫా రక్షణ కొరకు పోరాడటానికి అనుమతినివ్వవలసిందని ఖలీఫా మహనీయ ఉస్మాన్(ర)ని అర్థించారు. కాని మహనీయ ఉస్మాన్(ర), "దైవం మీకు సద్ఫలితం అనుగ్రహించుగాక! నా కారణంగా ఎవరి రక్తం కారడమూ నాకు ఇష్టం లేదు" అని ఖరాఖండిగా చెప్పారు.

## మహనీయ అలీ(ర) ఖిలాఫత్

పీడనకు గురయిన ఖలీఫా మహనీయ ఉస్మాన్(ర)ని విభిన్న తెగల దుండగులు, తిరుగుబాటు దారులు, ధర్మ భ్రష్టులు, అబద్ధం, అక్రమం, దౌర్జన్యం ఆధారంగా అమరగతి పాల్జే శారు. ఈ విషాదకర సంఘటన హిజ్రీ 35, జుల్ హిజ్జా 18వ తేదీన, శుక్రవారం నాడు జరిగింది. ఆ తరువాత మూడు రోజుల వరకు ఖిలాఫత్ పీఠం ఖాళీగానే ఉంది. ప్రవక్త నగరం మదీనాలో అంతా విషాదఛాయలు అలుముకున్నాయి. కడకు వాడ వాడన కూడా బాధా తప్త ఘోషణలు వినవస్తు న్నాయి. రాజకీయ రంగం సబాయీ దుండగుల కైవస మయింది.

ఆ సందర్భంలో మహనీయ అలీ(ర) కన్నా జనప్రియ నాయకత్వం మరొకటి లేకపోయింది. ఆయనకు తోడుగా మహనీయత మాత్రమే కాక ప్రజాభిప్రాయం కూడా పూర్తిగా ఆయన పక్షంలోనే ఉన్నాయి. జనం మహనీయ అలీ(ర) వద్దకు వెళ్లి ఖిలాఫత్ భారాన్ని స్వీకరించ వలసిందిగా అభ్య ర్థించినప్పుడు ఆయన దాన్ని తిరస్కరించారు. తాను ఖిలా ఫత్‌కు బదులు మంత్రిత్వానికి ప్రాధాన్యత నిస్తానని అన్నారు. అందరూ 'మీరు స్వీకరించ వలసిందే'నని పట్టుపట్టినప్పుడు ఆయన మస్జిద్‌లోకి వచ్చేశారు.

మహనీయ అలీ(ర) ప్రాపంచిక భేషజాలకు ఆమడ దూరాన ఉండే వ్యక్తి. మహనీయ ఉస్మాన్(ర) తరువాత సము దాయంలో ఉపద్రవాలు తలెత్తుతాయని, విచ్ఛిన్నత మహమ్మారిగా పొడసూపుతుందని ఆయన భయపడ్డారు. అందువల్లనే ముస్లిమ్ సముదాయం మేలు కోరి ఆయన ఖిలాఫత్ బాధ్యతలు స్వీకరించడానికి అంగీకరించారు. అయినప్పటికీ ఆయన పైన మూఢజనుల విమర్శలు తప్పలేదు. ఇంకా జమల్ (ఒంటెల) పోరాటం, సిఫ్ఫీన్ (ఒకానొక స్థలం) పోరాటం వంటి దౌర్భాగ్య ఘటనలు సంభ వించాయి. కాని ఇస్లామ్ శత్రువు అబ్దుల్లా బిన్ సబా, అతని అనుచరులు సత్యానికీ సన్మార్గానికీ విముఖులయిన వారు ఉపద్రవ అగ్నికి ఆజ్యం పోశారు.

## సర్వసామాన్య బయ్‌త్

మహనీయులు తల్హా, జుబైర్ (రజియల్లాహు అన్హుమా) బయ్‌త్ చేశారు. ఆ తరువాత, తాము కూడా బయ్‌త్ చేస్తాము కాని అందరి తరువాత అన్నారు కొందరు. మీరు చేస్తారని పూచీ ఎవరుంటారు అని కోపగించారు బయ్‌త్ చేయాలని పట్టు పట్టిన వారిలో ఒకరు. 'ఈ మూఢత్వం ఏమిటీ? వీరికి పూచీ నేనుంటాను' అని గద్దించారు మహనీయ అలీ(ర). ఆ పైన బయ్‌త్ సర్వ సామాన్యమయింది. మదీనాలో ఉన్న సహచరమాన్యులు అందరూ బయ్‌త్ చేశారు. కొందరు సహ చరులు మాత్రం ఈ బయ్‌త్‌ను తప్పించుకునేందుకు సిరియా వెళ్ళిపోయారు. అక్కడ జరిగినదంతా ప్రజలకు వివరించారు. అనేక మంది మహనీయ ఉస్మాన్(ర) హత్యకు ప్రతీకారం తీర్చుకోవడమే తమ ఉద్దేశంగా ప్రమాణం చేసి మరీ ప్రకటిం చారు.

## సమగ్ర ప్రసంగం

బయ్‌త్ జరిగిన తరువాత మహనీయ అలీ(ర) మింబర్(వేదిక) నెక్కి క్లుప్తంగా కాని భావగర్భితంగా ప్రసంగించారు. అందులో ఆయన 'ముస్లిముల ఒండొకరి హక్కులు, బాధ్యతలను గురించి వివరించారు. ఎటువంటి ఉపద్రవాలు వినాశకర చర్యలు లేవ నెత్తకుండా మెలగాలని వారిని బోధించారు. వారి ధార్మిక, నైతిక, విధి నిషేధాలను గుర్తు చేశారు. ఇంకా దైవభక్తి, పరలోక చింతన, జవాబు చెప్పుకోవలసిన బాధ్యతను గురించి స్పృహ కలిగించారు. మరి మనం విత్తినదే పంటగా కోయవలసి ఉంటుందని గుర్తు చేశారు. చేసిన ఆచరణల ఫలితాలే, ప్రతిఫలం, లేదా శిక్షగా అనుభవించవలసి వస్తుం దని కూడా హెచ్చరించారు.

ఆ తరువాత కొందరు అప్పటి వరకు బయ్‌త్ చేయని వారు వస్తే వారిని ఆహ్వానించి బయ్‌త్ చేయించారు. వారికి కూడా తెలిపారు, 'నేను వాగ్దానం చేస్తున్నాను, సదా దైవ గ్రంథం, ప్రవక్త సంప్రదాయాలను అమలు పరుస్తాను. షరీఅత్ ఆదేశాలను సరిగ్గా విధిస్తూ ఉంటాను' అని.

## ప్రతీకారేచ్ఛ

మహనీయ అలీ(ర) మస్జిద్‌లో ప్రసంగం తరువాత ఇంటికి

వచ్చారు. కాస్సేపటికి మహనీయులు తల్హా, జుబైర్(ర) ఆయన వద్దకు వచ్చి, "మీరు ఉస్మాన్ హంతకులకు దూర మవడమే కాక వారితో రక్త పరిహారం తీర్చుకోవడం పట్ల ఆలోచించి అవసరమయిన చర్యలు చేపట్టాలి" అని సలహా ఇచ్చారు.

ఆయన, "నాకూ ఈ విషయం తెలిసిందే, అయితే మీరూ గమనిస్తూనే ఉన్నారు, ఆ దుర్మార్గులే పరిస్థితుల మీద ఆధిక్యత సంపాదించి ఉన్నారు. అలాంటప్పుడు రక్త పరిహారం సాధ్యమా? నేననేది ఏమంటే వారి చేష్టలు అత్యంత దుర్మార్గమయినవి, వారిని పట్టి శిక్షించవలసిందే కాని పరిస్థితుల్లో కొంత మార్పు రావాలి, నాకు అంత వరకు వ్యవధి నివ్వండి" అన్నారు.

అది విని వారు తిరిగి వెళ్ళి పోయారు, కాని ఆ పైన విభిన్న ఆలోచనలు వారి అంతర్యాలలో పుట్టసాగాయి. కొందరు సహచరులు మదీనా వదలి వెళ్ళారు. మిగిలిన వారిని మహ నీయ అలీ(ర) రాజధానిలో ఆపి ఉంచారు.

## గవర్నర్ల మార్పు

ఖిలాఫత్ బాధ్యతలు స్వీకరించిన తరువాత మహనీయ అలీ(ర) కొందరు గవర్నర్లను మార్చాలని అనుకున్నారు. వారు ఆ స్థానంలో ఉండటం సమంజసం కాదని తలపోశారు ఆయన. ఆ పైన ఆయన అయిదుగురిని విభిన్న ప్రాంతాల గవర్నర్లుగా నియామక పత్రాలు ఇచ్చి పంపారు.

వారిలో ఒకరు, 'సహల్ బిన్ హనీఫ్'. ఆయన్ని సిరియాకు గవర్నర్‌గా పంపారు. దారిలోనే ఆయన్ని కొందరు అడ్డుకుని తిరిగి వెళ్ళి పోయేందుకు బలవంత పెట్టారు.

'కైస్ బిన్ సఅద్'ని ఈజిప్టుకు పంపారు. ఆయన అక్కడికి వెళ్ళగా, జనం మూడు వర్గాలుగా విడిపోయారు. కొందరు ఆయనకు సమర్థకులుగా, కొందరు వ్యతిరేకులుగా, మరి కొంతమంది ఏ సంబంధం లేని వారుగా ఉండిపోయారు. సమర్థకులయిన వారు రక్త పరిహారం తీర్చుకోరాదని షరతు పెట్టారు. ఇతరులేమో ఖలీఫా అపరాధుల్ని వదలి పెట్టారని నిరసనగా ఆ నియామకాన్ని వ్యతిరేకించారు.

'ఉస్మాన్ బిన్ హనీఫ్'ను బస్రా గవర్నర్‌గా నియమించి పంపారు అలీ(రజి). ఈయన కూడా మూడు వర్గాలను ఎదుర్కోవలసి వచ్చింది.

'అమ్మారా' కూఫా చార్జ్ తీసుకోవలసింది. దారిలో ఆయన్ని 'తల్హా బిన్ ఖువైలిద్ అసదీ' కలుసుకుని, "నీవు ఎదురు పలకకుండా తిరిగి వెళ్ళిపో, నీవు బస్రా వెళ్లినట్లయితే అక్కడి జనం నిన్ను చంపివేస్తారు" అని భయపెట్టారు.

'ఉబైదుల్లాహ్ బిన్ అబ్బాస్' యమన్‌కు బయలుదేరారు. అక్కడి గవర్నర్ 'యాలా బిన్ ఉమయ్యా' ('మునయ్యా' అని కూడా అంటారు), కొత్త గవర్నర్ నియామకం గురించి తెలిసి అక్కడి రెవిన్యూ వసూళ్ళన్నీ తీసుకుని మక్కా వెళ్ళి పోయారు.

ఇస్లామీయ రాజ్యాల రాజధానులన్నింటా వ్యాకులత నెల కొన్నది. మహనీయ అలీ(ర) మహనీయ ఉస్మాన్(ర) రక్త పరిహారం తీర్చుకోలేదని, సిరియా గవర్నర్ ముఆవియా బిన్ సుఫ్యాన్ ఆయన పట్ల అయిష్టత కలిగి, ఆయన ఖిలాఫత్‌ని కూడా అంగీకరించలేదు. రెండు నెలలు కడిచిన తరువాత మహనీయ ముఆవియ, అమీరుల్ మూ'మినీన్‌కి ఓ లేఖ పంపారు. అందులో ఆయన పైన, 'ముఆవియా నుంచి అలీకి' అని మాత్రమే ఉంది. క్రింద ఆయన ముద్ర మాత్రం వేశారు. అంతే ఏమీలేదు.

ఆ లేఖను ఓ వ్యక్తికి ఇచ్చి రాజధానిలో ప్రవేశించిన తరువాత నగర వాసులు కావాలంటే చదువుకునేలా తెరచి పెట్టుకోవా లని ఆ వ్యక్తికి నిర్దేశించారు ముఆవియ. అతను అలానే చేసి లేఖను అమీరుల్ మూ'మినీన్‌కు అందజేశాడు. ఆయన దాన్ని చూసి ఆశ్చర్యంగా, "ఇందులో ఏమీ లేదే, ఏమిటీ విశేషం?" అని అడిగారు. దానికి ఆ వ్యక్తి, "డెమా స్కస్ జామిఅ మస్జిద్‌లో మింబర్ పైన బాధిత ఖలీఫా మహనీయ ఉస్మాన్(ర) రక్త సిక్తమయిన చొక్కా, ఆయన గారి సతీమణి నాయిలా గారి నరకబడిన చెయ్యి పెట్టబడి ఉంది. దాని ముందర అరవై వేల మంది కూర్చొని శోకా లాపన చేస్తూ ప్రతీకారం తీర్చుకునే వరకు ఊరుకునేది లేదని అంటు న్నారు" అని చెప్పాడు.

ఆయన, "ప్రతీకారం ఎవరి పైన తీర్చుకోవాలి?" అని ప్రశ్నిం చారు. అతను, "మీ పైనే ఎందుకంటే మీరు ఆ హత్యలో పాల్గొనక పోయినా హంతకులకు సహాయపడి వారిని సేనలో భర్తీ చేసుకుని హోదాలు ఇచ్చారు. దీన్ని మీరూ కాదనలేరు" అన్నాడు. ఇదంతా ఖండితంగా తీవ్రమయిన భేదాభిప్రాయమే అని తలిచారు మహనీయ అలీ(ర). ఫలితంగా, తనకు ఇష్టం లేకపోయినా మహనీయ ముఆవియ(ర)కు వ్యతిరేకంగా సైనిక చర్య తప్పదని భావించారాయన.

మహనీయ అలీ(ర) ముస్లిమ్ సముదాయంలో విభేదాలను అతి హీనమయినవిగా భావించేవారు. అనైక్యత, విభేదాలు, అరాచకాలు ఆయనకు సుతరామూ నచ్చని విషయాలు.

ఆయన "విభేదాలను ధార్మికంగా ఏవగించ తగినవని, జనం సమైక్యంగానయినా మనగలగాలి లేదా నేనయినా నా మిత్రుల (గత ఖలీఫాల) వలె మరణాన్నయినా పొందాలి" అనే వారు.

కుసమ్ బిన్ అబ్బాస్‌ను తన స్థానంలో తాత్కాలిక ఖలీఫాగా నియమించి తన కుమారుడు హనఫియాకు సైన్య ధ్వజం ఇచ్చారు మహనీయ అలీ(ర). ఈ సందర్భంలో మదీనా వాసులు తమ తరఫున జియాద్ బిన్ హన్జలాని, యుద్ధ సంకల్పాన్ని విరమింప జేయడానికి పంపారు. ఈ లోగా మహనీయులు తల్హా, జుబైర్ ఉమ్రా చేసే అనుమతి తీసుకుని మక్కా వెళ్ళిపోయారు. ఇంకా మహనీయ అలీ సన్నాహాలు చేస్తుండగానే, విశ్వాసుల మాతృమూర్తి మహనీయులు ఆయిషా(ర), తల్హా, జుబైర్ బస్రా చేరి అక్కడ మహనీయ ఉస్మాన్(ర) హత్యా పరిహారం గ్రహించేందుకు అంతా ప్రోగవుతున్నారని సమాచారం అందింది.

వాస్తవానికి, మహనీయ ఆయిషా(ర) మహనీయ ఉస్మాన్(ర) అమరగతికి ముందే హజ్జ్ కొరకు మక్కా వెళ్ళి ఉన్నారు. అక్కడే మహనీయ ఉస్మాన్ అమరగతి, మహనీయ అలీ ఖిలాఫత్ సమాచారాలు ఆమెకు అందాయి. ఈ ఉదంతాలన్నీ ఆవిడ మక్కా వాసులకు విడమర్చి, మహనీయ అలీ దుండగుల వలలో చిక్కుకున్నారని తెలిపి అక్కడి నుంచి వెయ్యి మందితో బస్రాకు బయలుదేరారు. బస్రా చేరువకు చేరిన తరువాత అక్కడ ఉస్మాన్ బిన్ హనీఫ్ ఎదురయ్యారు. ఈయన మహనీయ అలీ(ర) నియమించిన కొత్త గవర్నర్.

## బలవంతపు బయ్త్

ఆయన విచారించగా ఆయనకు తెలిపారు బస్రా బృందం వారు, 'జనుల్ని వర్తమాన పరిస్థితులను గురించి తెలిపి పరిస్థితుల్ని చక్క బరచడానికి సహకరించేందుకు సమ్మతిస్తే వారికి ఓ నాయకత్వం, ఓ సంఘటిత కృషి జరిపేందుకు చేయూత అందించాలని' అని బదులిచ్చారు. వారిని అడిగారు, "మీరు మహనీయ అలీ(ర) వద్ద బయ్త్ చేయలేదా?" అని. "మాలో కొందరి చేత బలవంతంగా బయ్త్ చేయించారు" అని సమాధానం వచ్చింది.

ఆ తరువాత తల్హా, జుబైర్ ప్రసంగించారు. దాని మీదట విశ్వాసుల మాతృమూర్తి మహనీయ ఆయిషా(ర) ప్రసంగించారు. ఆమె ఉచ్చస్వరాన గంభీరంగా మాట్లాడారు. ఫలితంగా బస్రా వాసుల ఓ పెద్ద సంఖ్య వారికి తోడయ్యింది. ఒక రోజు సబాయీ వర్గ నాయకుడు హకీమ్ బిన్ జబ్లా, గవర్నర్ ఉస్మాన్‌తో కలసి మహనీయ ఆయిషా వర్గీయుల మీదికి దాడి జరిపారు. విశ్వాసుల మాతృమూర్తి వద్ద బంట్రోతు, పోరాడకండి అని కేకలు వేస్తూనే ఉండగా పోరు తీవ్ర తరమయింది. కడకు మధ్యాహ్నం వేళకు సబాయీలు ఓడిపోయి మహనీయ ఆయిషా సహచరులు గెలిచారు.

ఆ తరువాత తల్హా, జుబైర్‌తో గవర్నర్ ఉస్మాన్ ఒడంబడిక చేసుకున్నారు, ఓ ఉమ్మడి వ్యక్తిని మదీనాకు పంపించి, మహనీయులు తల్హా, జుబైర్‌లతో బలవంతాన బయ్త్ చేయించారా లేదా వారు స్వచ్ఛందంగా చేశారా అని విచారించడానికి. ఆ విచారణలో బలవంతాన బయ్త్ చేసినట్లు తేలితే గవర్నర్ ఉస్మాన్ బస్రా వదలి వెళ్ళిపోతారు, లేదా జుబైర్, తల్హాల సహచరులు తిరిగి వెళ్ళిపోతారు. కాగా వారు బస్రా కాజీ (న్యాయమూర్తి) కఅబ్ బిన్ సూర్‌ని మదీనా పంపారు. కఅబ్ శుక్రవారం రోజున ప్రవక్త మస్జిద్‌లో తన రాకకు ఉద్దేశం తెలిపి వారిరువురి బయ్త్ ఏ విధంగా జరిగిందో తెలుప వలసిందని, ఆ విధంగా తగాదా సమసి పోగలదని అభ్యర్థించారు.

## సాక్ష్యం!

జనం మౌనం వహించారు. అయితే మహనీయ ఉసామా బిన్ జైద్ నిలబడి, "నిస్సందేహంగా ఆ ఇరువురితో బలవంతాన బయ్త్ చేయించడం జరిగింది" అన్నారు. అంతే, కొందరు మహనీయ ఉసామా మీదికి ఎగబడ్డారు. దాదాపు ఆయన్ని హత్య చేయడమే జరిగేది, అంతలో మహనీయులు సుహైబ్ రూమీ, అబూ అయ్యూబ్ అన్సారీ, ముస్లిమ ప్రభృతులు ఆయన్ని ఏదో విధంగా కాపాడగలిగారు. ఇంకా, ఉసామా చెప్పింది నిజమే అని ధ్రువపరిచారు.

మస్జిద్‌లో జరిగిన ఈ సంఘటన తరువాత మహనీయ అలీ(ర), గవర్నర్ ఉస్మాన్‌కు లేఖ పంపించారు. అందులో ఆయన, "నీవు అలసత్వం చూపుతున్నావు, బలవంతాన బయ్త్ చేయించినా అది సమైక్యత కొరకే గాని విభేదాలు సృష్టించేందుకు కాదు" అని వ్రాశారు. మస్జిద్‌లో లభించిన సాక్ష్యాన్ని తీసుకుని, ఖలీఫా సందేశ వాహకుడు, కఅబ్ లేఖను తీసుకుని గవర్నర్‌ని కలుసుకున్నారు. అప్పుడు గవర్నర్ మాట తప్పారు. చివరకు పోరు జరగనే జరిగింది. అందులో గవర్నర్ ఓడిపోయి పట్టుబడ్డారు. కాని విశ్వాసుల మాతృమూర్తి అతన్ని వదలి పెట్టి ఆమె స్వయంగా మదీనా వచ్చేశారు. పోరులో సబాయీల నాయకునితో సహా అతని అనుచరులు అనేక మంది హతులయ్యారు.

★★★

# వక్ఫ్ ఆస్తులకు చిల్లు పెడుతున్న బిల్లు!




యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్

**ఇటీవలి కాలంలో** బాగా ప్రచారంలో ఉన్న పదం 'వక్ఫ్'. దీని శాబ్దిక అర్థం నిలకడ, ఆపుదల, ధర్మసొత్తు, ధర్మార్థము అని వస్తుంది. షరీయత్ పరిభాషలో ఎవరైనా ఒకవ్యక్తి తనకు చెందిన ఆస్తిపై లేక వస్తువుపై తన హక్కును, యాజమాన్యాన్ని పూర్తిగా వదులుకొని దైవానికి దఖలు పరచడాన్ని 'వక్ఫ్ ' అంటారు. అంటే ఏదేని భూమి, వస్తువు లేక మరేదైనా వక్ఫ్ చేసిన తరువాత ఇక తనకు కాని, తన వారసులకు కాని మరెవరికైనా దానిపై ఏ విధమైన హక్కూ అధికారం ఉండదు. అది పూర్తిగా అల్లాహ్ కే చెందిన ఆస్తి. వక్ఫ్ ఒక ఆరాధన. వక్ఫ్ ప్రధాన ఉద్దేశ్యం దైవాన్ని సంతోషపరచడం, సాటి మానవులపై ప్రేమను, సోదర భావాన్ని వ్యక్తపరచడం. నిజానికి ఇస్లాంకు పూర్వం వక్ఫ్ భావన లేదు. పవిత్ర ఖురాన్‌లో, 'మీరు అత్యధికంగా ప్రేమించే వాటిని దైవమార్గంలో వినియోగించనంతవరకు మీరు ధర్మపరాయణులు కాలేరు.' (3-92) అన్న వాక్యం అవతరించినప్పుడు, అది తెలుసుకున్న అనేక మంది ప్రవక్త అనుచరులు తమ విలువైన ఆస్తి పాస్తుల్ని (తోటలు, భూములు వగైరా) దైవ మార్గంలో వితరణ చేశారు. ప్రవక్త కాలంలో ప్రారంభమైన వక్ఫ్ భావన ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికీ కొనసాగుతోంది. భారతదేశాన్ని రమారమి వెయ్యేళ్ళపాటు పాలించిన ముస్లిం రాజులు అసంఖ్యాక మసీదులు, ఖబ్రస్తాన్‌లు, దర్గాలు, విద్యాలయాలకు విలువైన భూములు, ఆస్తులు వక్ఫ్ చేశారు. వక్ఫ్ ప్రాముఖ్యం, నిరంతరం, లభించే పుణ్యఫలాన్ని దృష్టిలో ఉంచుకొని ముస్లింలు తమ విలువైన ఆస్తిపాస్తుల్ని వక్ఫ్‌చేస్తూ వచ్చారు. మసీదులు, విద్యాలయాలు, దర్గాలు, స్మశాన వాటికలు, సత్రాలు మొదలైనవి ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా సజావుగా నిరాటంకంగా కలకాలం కొనసాగడానికి ఈ ఆస్తులు దోహదపడాలని వాటిని అల్లాహ్ పేర అంకితం చేశారు. కనుక వక్ఫ్ ఆస్తులపై ఎవరికీ ఎటువంటి హక్కూ, అధికారము ఉండదు. అవి కేవలం అర్హత కలిగిన పేదసాదల సంక్షేమానికి, వాటి నిర్వహణకు మాత్రమే వినియోగించాలి. కాని ఈ స్ఫూర్తికి

భిన్నంగా ఆంగ్లేయుల కాలంలో వక్ఫ్ ఆస్తుల దుర్వినియోగం మొదలైంది. అప్పుడు ముస్లింలు దీన్ని అడ్డుకో వడంతో వక్ఫ్ యాక్ట్ 1923 ఉనికిలోకి వచ్చింది. 1945లో పూర్తిస్థాయిలో వక్ఫ్ యాక్ట్‌ను ప్రవేశపెట్టారు. అనేక సందర్భాల్లో సవరణలు కూడా చేశారు. యాక్ట్ ప్రధాన ఉద్దేశ్యం వక్ఫ్ ఆస్తుల్ని సంరక్షించడం, వాటి దుర్వినియోగాన్ని నివారించడం. కాని వక్ఫ్ యాక్ట్ ఉన్నప్పటికీ దురదృష్టవశాత్తూ దాని ఉద్దేశ్యం నెరవేరలేదు. అప్పుడు మళ్ళీ 1985లో మరో కొత్త వక్ఫ్ చట్టం తీసుకువచ్చినా ముస్లింల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకో లేదు. తరువాత 1995లో, 2010 లో, 2013లో చట్టంలో సవరణలు చేశారు. అయినా నిరాశే మిగిలింది. ఇప్పుడు తాజాగా నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం వక్ఫ్ ఆస్తులపై కన్నేసి చట్టంలో సవరణలు ప్రతిపాదిస్తూ పార్ల మెంటులో బిల్లును ప్రవేశపెట్టింది. ఎందుకంటే మనదేశంలో సైన్యం, రైల్వే తరువాత అత్యధిక ఆస్తులు వక్ఫ్ బోర్డు దగ్గర మాత్రమే ఉన్నాయట. ఎలాగైనా ఈ ఆస్తుల్ని ముస్లింల దగ్గరి నుండి లాగేసుకోవాలని, ఇప్పటికే తమ అస్మదీయుల కబ్జాల్లో ఉన్న వేల కోట్ల ఆస్తుల్ని క్రమబద్ధీకరించుకోవాలన్నది మోషా అండ్ కో దుష్టపన్నాగం. అందుకే ఈ కొత్త బిల్లులో షుమారు నలభై సవరణలు ప్రతిపాదిస్తూ ముస్లింల సంక్షేమం కోసమే ఈబిల్లు తెస్తున్నామని, దీనివల్ల ముస్లిం సమాజానికే మేలు కలుగుతుందని ఎప్పటిలాగే కపటప్రేమ ఒలకబోస్తున్నారు. బిల్లును గనక నిశితంగా పరిశీలిస్తే మోడీ ప్రభుత్వ కపటప్రేమ, దురుద్దేశం స్పష్టంగా అర్థమవుతుంది. సరాసరి ముస్లింల ధర్మంలో, వారి వ్యక్తిగత విషయాల్లో వేలుపెట్టడం, ధర్మపరంగా వారికున్నటువంటి ప్రత్యేకతను దెబ్బతీయడం లక్ష్యంగా కనబడుతోంది. భాజపా సర్కార్ ప్రతిపాదించిన సవరణ బిల్లు ప్రకారం ముస్లిమేతరులు కూడా బోర్డు మెంబర్లుగా, సీఈఓలుగా ఉండవచ్చునట. కాని, ప్రతిపాదిత చట్టం ప్రకారం, తమ ఆస్తుల్ని వక్ఫ్ చేయడానికి ముస్లిమేతరులు అర్హులు కానప్పుడు ఎక్జిక్యూటివ్ లుగా, సీఈవోలుగా ఎలా అర్హులు అవుతారన్న దానికి సహేతుక సమాధానం లేదు. అంటే చట్ట సవరణ ద్వారా తమ వారిని (సంఘీయులను) బోర్డులోకి పంపి వక్ఫ్ ఆస్తుల్ని క్రమక్రమంగా కాజేయడం అసలు ఉద్దేశ్యం. ఈ సవరణల్లో ఉన్న మరో దుర్మార్గం ఏమిటంటే, ఏ ఉద్దేశ్యం కోసం ముస్లింలు తమ ఆస్తుల్ని వక్ఫ్ చేశారో, అది కాకుండా ప్రభుత్వం తన ఇష్టం వచ్చిన పద్దుల్లో వెచ్చిస్తుందట. ఇది వక్ఫ్ మూల సూత్రానికే వ్యతిరేకం. మరో గమ్మత్తయిన విషయం ఏమిటంటే, ఎవరైతే ఇస్లాం ధర్మాన్ని ఐదేళ్ళుగా ఆచరిస్తున్నారో వారే వక్ఫ్ చేయడానికి అర్హులట. ఇస్లాం ధర్మాన్ని స్వీకరించి ఐదేళ్ళు పూర్తికానివారు తమ ఆస్తుల్ని దానం చేస్తామంటే ఈ కొత్తచట్టం ఒప్పుకోదు. ఇది కూడా వక్ఫ్ సూత్రానికి, స్ఫూర్తికి వ్యతిరేకమే. ఎందుకంటే ఇస్లాంప్రకారం ముస్లిమేతరులు కూడా వక్ఫ్ చేయడానికి అర్హులే. కాని ఇదేమి చట్టమో ముస్లిం అయి ఉండి కూడా వక్ఫ్ చేస్తానంటే ఈచట్టం ఒప్పుకోవడంలేదు. నిజానికిది ఒక ముస్లింను తన ధర్మపరమైన ఆరాధన చేయవద్దని అడ్డుకోవడమే. భారత రాజ్యాం గంలోని 25 వ అధికరణ ప్రకారం ప్రతివ్యక్తీ స్వేఛ్ఛగా తనకు నచ్చిన మతాన్ని స్వీకరించే, ఆచరించే, ప్రచారం చేసుకునే హక్కును కలిగి ఉన్నాడు. ఆర్టికల్ 26 ప్రకారం ప్రతి ఒక్కరూ తమ మతం శాఖలను, ధార్మిక కార్యకలాపాల కోసం సంస్థలను స్థాపించుకొని, వాటిని నిర్వహించుకొనే హక్కునూ కలిగి ఉన్నారు. రాజ్యాంగ ప్రసాదితమైన ఈ హక్కును కాలరాసే అధికారం ఎవ్వరికీ లేదు. అలాగే ఈ సవరణ బిల్లులో ఉన్న మరో దుర్మార్గం ఏమిటంటే, వక్ఫ్ ఆస్తులకు సంబంధించి ఏదైనా వివాదం తలెత్తితే నిర్ణయాధికారం జిల్లా కలెక్టర్లకు దఖలు పరచడం జరిగింది. ప్రస్తుతమైతే వివాద పరిష్కారానికి హైకోర్టు న్యాయమూర్తి నియమించిన వక్ఫ్ ట్రిబ్యునల్ ఉంది. దీన్ని కాదని కలెక్టర్లకు నిర్ణయాధికారం కట్టబెడితే వాళ్ళు పాలకులకే వత్తాసు పలికే అవకాశాలు ఎక్కువ. మసీదు, మదర్సా, దర్గా, ఈద్గా తదితరాల విషయంలో ఏ చిన్న సమస్య తలెత్తినా దాన్ని ప్రభుత్వ ఆస్తిగా కలెక్టర్లతో రాయించేసుకోవడం ప్రభుత్వాధినేతలకు పెద్ద లెక్కకాదు. నాలుగైదు వందల ఏళ్ళనాటి మసీదులు, దర్గాలు, ఖబ్రస్తాన్ల రికార్డులు ఇప్పుడు కావాలంటే ఆచరణాత్మకంగా జరిగేపనికాదు. ఈ విధంగా కూడా కేంద్ర సర్కారు ముస్లింల ఆస్తుల్ని కొల్లగొట్టి వారి నోట్లో మన్నుకొట్టాలని చూస్తోంది. నిజానికి ధర్మం ప్రకారం, కొందరు సాక్షుల సమక్షంలో నేను నా ఫలానా ఆస్తిని అల్లాహ్ పేర వక్ఫ్ చేస్తున్నాను అన్నా అది వక్ఫ్‌గా పరిగణించబడుతుంది. మరి ఆ ఐందొందల ఏళ్ళనాటి సాక్షులు ఇప్పుడు ఉంటారా? కాబట్టి వక్ఫ్ సవరణ చట్టాన్ని ఆమోదించడమంటే, నిస్సందేహంగా ముస్లింల విలువైన ఆస్తుల్ని తేరగా కొల్లగొట్టడం, ఇప్పటికే కబ్జాకోరుల కబంధ హస్తాల్లో ఉన్న ఆస్తుల్ని క్రమబద్ధీకరించి వారికి ధారాదత్తం చేయడానికి మాత్రమే నరేంద్రమోడీ సర్కారు తీసుకురాదలచుకున్న దుర్మార్గమైన నిర్ణయంగా పరిగణించాల్సి ఉంటుంది. దాతృత్వం అనే భావనను నిర్వీర్యం చేసి ఆక్రమణదారులను, కబ్జాకోరులను ఆస్తులకు యజమానులుగా మార్చాలనుకుంటున్న ప్రతిపాదిత దుర్మార్గపు బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) నిర్ద్వంద్వంగా తిరస్కరించాలని, తిరస్కరిస్తుందనీ ఆశిద్దాం. ✤

# అశ్లీలతకు వ్యతిరేకంగా ఓ గొప్ప ఉద్యమం అవసరం


మూలం :
ముహియ్యుద్దీన్ గాజీ

అనువాదం :
ఆలియా బిన్తె మునీర్ షర్ఫియ


గత సంచిక తరువాయి

**ఒక జాతి ఉదాహరణ:**

వ్యభిచారం ఘోర పాపం. వ్యభిచారానికి అత్యంత వ్యథాభరితమైన శిక్ష పడుతుంది.

హజ్రత్ లూత్(అ) తన జాతిని సంస్కరించడం కొరకు విఫల యత్నం చేశారు. కానీ ఆ జాతి తలబిరుసుతనం పెరుగుతూనే పోయింది. చివరికి ఆ జాతి అత్యంత కఠినమైన వినాశనానికి గురైంది. ప్రళయం వరకు గుణపాఠం గరిపే విధంగా చేయ బడింది.

ఖుర్‌ఆన్‌లో ఆరు జాతుల వారికి పడిన శిక్ష గురించి వివరణా త్మకంగా ప్రస్తావించబడింది. అవి హజ్రత్ నూహ్, లూత్, సాలిహ్, హూద్, షుఐబ్, మూసా (అ) జాతులు.

ఈ జాతులు తీవ్రమైన నైతిక రుగ్మతలో మునిగిపోయి ఉండేవి. అల్లాహ్ వారి వద్దకు ప్రవక్తలను ప్రభవింపజేశాడు. వారు ఆ జాతి ప్రజల విశ్వాసాలు, నైతిక విలువల సవరణకై కృషి చేస్తూ ఉండేవారు. కానీ ఆ జాతి ప్రజలు తమ చేష్టలపై మంకుపట్టుగా ఉండేసరికి అల్లాహ్ శిక్ష వారిని సర్వనాశనం చేసింది. ముఖ్యంగా హజ్రత్ లూత్ (అ) జాతి స్వలింగ సంపర్కానికి పాల్పడేది. ఆ జాతిపై అల్లాహ్ శిక్ష అవతరించింది. అల్లాహ్ దైవదూతలను పంపి వారిని రాళ్లతో కొట్టించాడు.

తరువాత మా తీర్పు సమయం వచ్చేసినప్పుడు, మేము ఆ పట్టణాన్ని తలక్రిందులు చేసేసాము. దానిమీద కాల్చిన మట్టితో చేయబడిన రాళ్లు ఎడతెగకుండా కురిపించాము. (11:82)

ఆ జాతి ప్రజల ఘోర పాపం స్వలింగ సంపర్కానికి పాల్పడటం. ఈ దుశ్చేష్ట పరాకాష్ఠకు చేరినప్పుడు అల్లాహ్ తన శిక్షను పంపించి భూమిని వారి నుంచి పరిశుద్ధపరిచాడు.

ప్రస్తుత కాలంలో అశ్లీల కార్యాల ధ్వజవాహకులు పాప కార్యాల ప్రచారం చేస్తారు. తదుపరి వాటిని సాధారణమైనవిగా చూపిస్తారు. పిదప దానిని చట్టబద్ధం చేస్తారు. ఇక దానితో వ్యాపారం చేస్తారు.

ఏ జాతి వద్దకు హజ్రత్ లూత్ (అ) ప్రభవింప జేయబడ్డారో ఆ జాతిలో అశ్లీల కార్యం ఫ్యాషన్‌లా మారిపోయి ఉండింది. ప్రజలు బహిరంగంగా అశ్లీల పనులు చేసేవారు. అల్లాహ్ ఆ జాతిని వ్యథాభరితమైన శిక్షతో నాశనం చేసి సమస్త మానవాళి కొరకు గుణపాఠంగా చేశాడు. ఒకవేళ వ్యభిచారం సమాజంలో సర్వసాధారణం అయిపోయినా, అది ఫ్యాషన్‌గా మారిపోయినా,

ఒక రివాజులా మారిపోయినా కూడా అది ఎప్పటికీ కూడా సర్వ సాధారణం (నార్మల్) అయిపోదు అనే గుణపాఠం ఇచ్చాడు.

దానిలో ఉన్న చెడు, దాని పట్ల ఉన్న అసహ్యం కొంచెం కూడా తగ్గవు. దీనికి భిన్నంగా ఏదైనా పాపం లేదా వ్యభిచారం ఎంత ఎక్కువగా వ్యాపిస్తుందో దాని పట్ల అసభ్యత అంతే ఎక్కువగా పెరిగిపోతుంది. దానిని రూపుమాపడం కూడా అత్యంత అనివార్యంగా మారిపోతుంది.

### వ్యభిచారం, అత్యాచారాలు తోడునీడలే:

వ్యభిచారం, అత్యాచారాల మధ్య వ్యత్యాసం చూపించి వ్యభిచారాన్ని ప్రోత్సహించడం, అత్యాచారంపై గగ్గోలు పెట్టడం ఇది ప్రపంచానికి నమ్మకద్రోహం తలపెట్టడమే. అశ్లీలం, వ్యభిచారం, దౌర్జన్యం, అత్యాచారాల మధ్య అత్యంత లోతైన సంబంధం ఉంది.

ఏ సమాజంలో వ్యభిచారం సర్వసాధారణమై ఉంటుందో అక్కడ అత్యాచారాలు అత్యంత ఎక్కువగా సంభవిస్తాయి. ఏ సమాజంలో సిగ్గుబిడియాలు రాజ్యమేలుతాయో, అక్కడ అత్యాచారాలు బహు స్వల్పంగా సంభవిస్తాయి.

ఏ సమాజంలో అయితే వ్యభిచారం సర్వసాధారణమైపోయిందో, అశ్లీలత ఆచారంగా మారిపోతుందో ఆ సమాజంలో లైంగిక వేధింపులు, అత్యాచారాలు కూడా పెరిగిపోతాయి. దానికి కారణం ఏమిటంటే ఎప్పుడైతే మనోవాంఛలకు స్వేచ్ఛ ఇవ్వబడుతుందో, మనోవాంఛలు రాజ్యమేలుతాయో అక్కడ సిగ్గుబిడియాలు, అల్లాహ్ పట్ల భయాందోళనలు అడ్డుగోడలుగా మారవు. అప్పుడు మనిషి ఒకసారి డబ్బు వ్యామోహంలో, ఒకసారి పలుకుబడితో కూడా తమ కోర్కెలను పరిపూర్తి చేసుకోవాలనుకుంటాడు.

### వ్యభిచారం మనిషి సృష్టి:

హజ్రత్ లూత్ (అ) జాతి అశ్లీల కార్యంలో మునిగిపోయి ఉండేది. హజ్రత్ లూత్(అ) వారితో ఇలా అన్నారు: 'మీరు ఏ అసభ్యకరమైన చేష్టలకు పాల్పడుతున్నారో, ఆ చేష్టలకు మీకంటే ముందు ఏ మనిషి కూడా పాల్పడలేదు'.

మేము లూత్‌ను పంపాము: అప్పుడు అతను తన జాతి వారితో ఇలా అన్నాడు, "మీకు పూర్వం ప్రపంచ మానవులలో ఎవ్వరూ చేయని అశ్లీల కార్యాన్ని మీరు చేస్తున్నారు. ఇదేమిటి, మీరు పురుషుల వద్దకు పోతారు, దారి దోపిడీలు చేస్తారు, మీరు నిజానికి హద్దుమీరి పోయారు". (29: 28,29)

దీని ద్వారా బోధపడిందేమిటంటే అశ్లీల కార్యాలు మానవ స్వభావం నుంచి ఉనికిలోకి రావు. మనిషి తన స్వభావాన్ని చెరిపివేసి ఈ చెడుకి పాల్పడతాడు. ప్రతి అశ్లీల కార్యం ఏదో ఒక కాలంలో సృష్టించబడిందే. ప్రస్తుత కాలంలో కూడా షైతాను ప్రభావంతో మానవ మస్తిష్కం అశ్లీల కార్యాల కొత్త కొత్త రూపాలను సృష్టించడంలో తన సృజనాత్మక శక్తులను ధారబోస్తున్నాడు. నిజంగా చెప్పాలంటే ప్రస్తుత కాలం పూర్వపు వ్యభిచార సమాజాలను కూడా వెనుకకు నెట్టేసింది.

**(ఇంకా వుంది...)**


యువతరానికి
**విప్లవనాదం**
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
**గీటురాయి**
వారపత్రిక

**ఒక వారం చదవండి**
**ప్రతి వారం చదువుతారు !**

**చందా వివరాలు**

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
**GEETURAI WEEKLY**
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

**GEETURAI WEEKLY**
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com




**ఎవరికైతే అల్లాహ్ కృప ద్వారా విశ్వాసం అనే భాగ్యం లభించిందో అతనికి మహాభాగ్యం లభించినట్లు. అతను తన పూర్తి జీవితాన్ని గడపుతాడు. సన్మార్గ మార్గాన్ని అవలంబిస్తాడు. ఇహపరలోక సాఫల్యాన్ని కైవసం చేసుకుంటాడు. అయితే ఖుర్ఆన్ దృష్టిలో అసలైన విశ్వాసి ఎవరో స్పష్టంగా ఇలా తెలియజేయబడింది, 'విశ్వాసులు అన్నిటికంటే అధికంగా అల్లాహ్‌ను ప్రేమిస్తారు'. (2: 165).**

'విశ్వాసం' హృదయంలో గోప్యంగా ఉండే ఒక ఉత్తమ సుగుణం. ఈ సుగుణం తన హృదయంలో ఉన్నదీ లేనిదీ, 'తాను నిజంగానే అల్లాహ్‌ను ప్రేమిస్తున్నానా' లేదా 'తాను అల్లాహ్‌ను ప్రేమిస్తున్నాననే ఊహాలోకంలో జీవిస్తున్నానా అనేది ఎలా తెలుసుకోవాలో తెలియక తర్జనభర్జన పడుతున్న వారి కోసం కూడా అల్లాహ్ దిశానిర్దేశనం చేశాడు. ఆ చీకట్లో కొట్టుమిట్టాడకుండా ఒక గీటురాయిని కూడా ప్రసాదించాడు. దానిద్వారా అతి తేలికగా మనిషి స్వయంగానే అల్లాహ్ ప్రేమలో ఎంతగా సత్యవంతుడో తెలుసుకోగలుగుతాడు. అల్లాహ్ ప్రేమను తెలుసుకునే గీటురాయి ఏమిటంటే, దైవప్రవక్త ముహమ్మద్(స) బోధనలను ఆచరించటం, ఆయన సంప్రదాయాలను అమలు చేయటం. ఎవరైతే తన పూర్తి జీవితాన్ని దైవప్రవక్త(స) సంప్రదాయాలను పూర్తిగా అనుసరిస్తారో వారు తప్పకుండా అల్లాహ్‌ను ప్రేమిస్తున్నట్లు.ఎవరి జీవితాలైతే దైవప్రవక్త(స) సంప్రదాయాలకు దూరంగా జరిగిపోయాయో వారు అల్లాహ్‌ను ప్రేమిస్తున్నారనే విషయాన్ని నోటితో ప్రకటించినా, వారు తమ ఆచరణల ద్వారా ఆ విషయాన్ని తిరస్కరిస్తున్నారన్నమాట.

ప్రేమకు బదులు ప్రేమయే లభిస్తుంది. ఎవరైతే అల్లాహ్‌ను ప్రేమిస్తారో ఆ ప్రేమకు బదులు అల్లాహ్ వారిని ప్రేమిస్తాడు.

దాని కోసం ఒక షరతు ఏమిటంటే, అతని ప్రేమ సత్యమైన ప్రేమ కావాలి. అతను జీవితంలోని ప్రతి రంగంలో దైవప్రవక్త(స)ను అనుసరించాలి. ఒక విశ్వాసికి అల్లాహ్ ప్రేమ కంటే పెద్ద బహుమానం, అతని పాపాలను క్షమించి అతన్ని పరిశుద్ధపరచటం కంటే పెద్ద కానుక మరొకటేముంటుంది? ఈ విషయాన్ని అల్లాహ్ తన గ్రంథంలో ఇలా సెలవిచ్చాడు: ప్రవక్తా! నీవు ప్రజలకు ఇలా చెప్పు. మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే నన్ను అనుసరించండి. అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను మన్నిస్తాడు. ఆయన అమితంగా క్షమించేవాడు, అనన్యంగా కరుణించేవాడూను. వారితో ఇంకా అల్లాహ్‌కు, ప్రవక్తకూ విధేయత చూపండి అని అను. ఒకవేళ వారు నీ ఈ సందేశాన్ని స్వీకరించకపోతే అల్లాహ్ తనకూ, తన ప్రవక్తకూ విధేయత చూపటానికి నిరాకరించిన వారిని ప్రేమించటం అనేది నిశ్చయంగా జరగదు. (3: 31)

నిశ్చయంగా దైవప్రవక్త(స) గారికి విధేయత చూపటం అల్లాహ్ ప్రేమకు అర్హులుగా చేస్తుంది. కాని దైవప్రవక్తకు విధేయత చూపటం, ఆయన్ని అనుసరించటం ఎవరు చేయగలుగుతారు అనేది ఒక పెద్ద ప్రశ్న. దానికి సమాధానం ఏమిటంటే, ఎవరైతే ఆయన(స)ను అమితంగా ప్రేమిస్తారో వారే ఈ పనిని చెయ్యగలుగుతారు. దైవప్రవక్త(స) ప్రేమ అంటే ఆయన(స) గారి పుట్టినరోజు ఎంతో హుందాగా జరుపుకోవటం, వంటకాలు వండి తినటం, పంచటం ఒకే ఒక్కరోజు నానా హంగామా చేసి రెండవ రోజు నుండి తన ఇష్టానుసారంగా జీవితాన్ని గడపటం ప్రారంభించటం ఎంత మాత్రమూ కాదు. అతి తేలికగా అర్థమయ్యే విషయమేమిటంటే, మనం మన తల్లినో, మన తండ్రినో అధికంగా ప్రేమిస్తాము. కాబట్టి వారి పుట్టిన రోజున ఎంతో ఖర్చుచేసి, ఎంతో హుందాగా జరిపి అన్నదానాలు చేసి రెండో రోజు నుంచి వారిని అశ్రద్ధ చెయ్యటం, వారి ఆదేశాలను పెడచెవిన పెట్టడం, వారిని అనుసరించకపోవటం అనేది జరిగితే వారు జరిపిన ఆ వేడుకలకు అర్థమూ, పరమార్థమూ ఏమై ఉంటుంది?

దైవప్రవక్త(స) గారి ప్రేమ గురించి దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: నిస్సందేహంగా విశ్వాసులకు దైవప్రవక్త(స) స్వయంగా తమకంటే కూడా ముఖ్యుడు. (33: 6)

దైవప్రవక్త(స) ఒకసారి ఒక సభలో ఈ విషయాన్ని విశ్లేషిస్తూ ఇలా సెలవిచ్చారు: నేను మీకు మీ తండ్రికంటే, మీ సంతానం కంటే ఇంకా ప్రజలందరికంటే అధికంగా ప్రియమైన వాడిని కానంత వరకు మీలో ఏ వ్యక్తీ విశ్వాసి కాలేడు. ఆ సమావేశంలో హజ్రత్ ఉమర్(ర) కూడా ఉన్నారు. ఇది విన్న వెంటనే ఆయన(ర) 'ఓ దైవప్రవక్తా(స)! మీరు నా తల్లిదండ్రులకంటే, నా సంతానం కంటే నాకు ప్రియతములు. కాని నా ప్రాణం కంటే అధికం కాదు' అని అన్నారు. అప్పుడు దైవప్రవక్త(స) 'ఓ ఉమర్! అయితే నీ విశ్వాసం పరిపూర్ణం కాలేదు' అని అన్నారు. దానికి హజ్రత్ ఉమర్(ర) వెంటనే అయితే 'ఓ ప్రవక్తా(స)! నా ప్రాణం కంటే అధికంగా ప్రేమిస్తున్నాను' అని అన్నారు. అప్పుడు దైవప్రవక్త(స) 'ఇప్పుడు నీ విశ్వాసం పూర్తి అయ్యింది' అని సెలవిచ్చారు. ఆ తరువాత హజ్రత్ ఉమర్(ర) గారు తన జీవితాంతం ఈ విషయానికి కట్టుబడి ఉన్నారు. ఈ విషయం ఆయన(స) జీవితాన్ని విశ్లేషిస్తే బాగా అర్థమవుతుంది. ఆయన(స)ను ఎంతగా ప్రేమించేవారంటే దైవప్రవక్త(స) పరమ పదించిన సమయంలో ఆ వార్త విన్న ఆయన(ర) జీర్ణించుకోలేక పోయారు. తన కరవాలాన్ని ఎత్తిచూపుతూ, 'ఎవరైనా దైవప్రవక్త(స) పరమపదించారని అన్నట్లయితే అతని తలను ఖండించి వేస్తాను' అని ప్రకటించారు. చివరకు హజ్రత్ అబూబకర్(ర) గారి బోధనలతో ఆయన(ర) శాంతించారు. దీనిద్వారా ఆయన(ర) దైవప్రవక్త(స)ను ఎంతగా ప్రేమించేవారో, ఎంతగా ఆయన్ని(స) అనుసరించేవారో స్పష్టంగా తెలుస్తోంది.

ఒక పల్లెటూరు ప్రాంతంలో ఉండే ఒకతను దైవప్రవక్త(స) వద్దకు వచ్చి 'ఓ దైవప్రవక్తా(స) ప్రళయం ఎప్పుడు సంభవిస్తుంది' అని అడిగాడు. అంతలో నమాజు ప్రారంభించే సమయం అయి పోయింది. దైవప్రవక్త(స) నమాజు చేయించారు. నమాజు తరువాత అతనితో 'నీవు ప్రళయదినపు రోజు కోసం ఏమేమి ఏర్పాట్లు చేసుకున్నావు' అని ప్రశ్నించారు. దానికి అతను 'నేను నమాజు, ఉపవాసాలు, ఆరాధనలలో ప్రత్యేకంగా ఏమీ చెయ్యలేదు. కాని నేను అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను అధికంగా ప్రేమిస్తాను' అని సమాధానమిచ్చాడు. దానికి దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: 'మనిషి ఎవరినైతే ప్రేమిస్తాడో రేపు అతనితోపాటే ఉంటాడు'. హజ్రత్ అనస్(ర) ఇలా అన్నారు: ఈ మాట విన్న అక్కడున్న దైవప్రవక్త(స) సహచరులు ఎంతగా సంతోషించారంటే, వారు ఈ విధంగా సంతోషపడటాన్ని నేను ఎన్నడూ చూడలేదు.

ఆయన(స) గారి సహచరుల గురించి విశ్లేషిస్తే తెలిసేదేమిటంటే వారు ఆయన(స)ను నీడలా అధిక సమయం వెన్నంటి ఉండేవారు. ఆయన(స) బోధనలు ఆయన(స) నోటి నుంచి వెలువడగానే ఆచరించటం మొదలుపెట్టేవారు. ఆ ఆచరణ వారి మనసుకు, వారి కార్యాలకు ఎంతగా వ్యతిరేకమైనప్పటికీ సరే. దైవప్రవక్త(స) కూడా తమ సహచరులకు అమితంగా ఇష్టపడేవారు. వారిని సంస్కరిస్తూ ఉండేవారు. అలాంటి వారినే అల్లాహ్ కూడా ఇష్టపడతాడు అని చెప్పడం జరిగింది.

కాని ఈ రోజు దైవప్రవక్త(స) అనుయాయులం అని చెప్పుకునే మనం ఒకసారి హృదయంపై చెయ్యి వేసుకుని విశ్లేషించుకోవాలి. దైవాజ్ఞలను, దైవప్రవక్త(స) బోధనలను ఎంతగా అనుసరిస్తున్నామో తెలుసుకోవాలి. కారుచీకట్లలో కొట్టుమిట్టాడుతూ ఉండే ప్రజలకు జ్ఞాన జ్యోతిని అందించటానికి ఆయన(స) చేసిన కృషిని, ఒక్కొక్క వ్యక్తిని సంస్కరించటానికి ఆయన(స) పడిన కష్టాన్ని జ్ఞాపకం తెచ్చుకోవాలి. ఈనాడు కూడా అంధకారంలో జీవిస్తున్న ప్రజల కోసం ఆయన(స) శ్రమించిన దానిలో ఒకటో వంతు కూడా మనం శ్రమిస్తున్నామో లేదో చూసుకోవాలి. కనీసం దురూద్‌నైనా రోజులో ఎన్నిసార్లు పఠిస్తున్నామో చూసుకోవాలి. ఆ తరువాత తాము దైవప్రవక్త(స) గారి ప్రేమికులో కాదో స్వయంగా తామే నిర్ణయించు కోవాలి.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

89 ఆయత్‌లు

# 43. అజ్ జుఖ్రుఫ్

86 ఆయన్ని వదిలి వీరు వేటినయితే వేడుకుంటున్నారో అవి ఎటువంటి సిఫారసు చేసే అధికారం కలిగి లేవు, ఎవరయినా జ్ఞానం ఆధారంగా సత్యానికి సాక్ష్యమిస్తే తప్ప.[68]

87 – 88 మిమ్మల్ని ఎవరు పుట్టించారని వీరిని నీవు అడిగినట్లయితే స్వయంగా వీరే చెబుతారు, అల్లాహ్ అని.[69] అలాంటప్పుడు వీరు ఎటుపోయి మోసపోతున్నారు? ప్రవక్త పలికే ఈ మాట మీద ఒట్టు, 'ప్రభూ! ఈ జనులు విశ్వసించబోనివారు'.[70]

89 సరే, ప్రవక్తా, వీరి పట్ల చూపోపు వహించు, మీకో సలామ్ అని చెప్పివెయ్యి[71] అనతి కాలంలోనే వీరికి అంతా తెలిసిపోతుంది.

**(68వ పాదసూచిక గత సంచిక తరువాయి)**

ఈ ఆయత్‌లో ఉప విషయాలుగా రెండు ప్రముఖమయిన గొప్ప సూత్రాలు కూడా అన్వయ రూపం పొంది ముందుకు వస్తాయి. ప్రప్రథమంగా, దీనివల్ల తెలిసేదేమిటంటే, జ్ఞాన రహితంగా సత్యానికి సాక్ష్యం ఇవ్వడం ప్రపంచంలో విశ్వసనీయంగా పరిగణించబడినా అల్లాహ్ దృష్టిలో మటుకు అది విశ్వసనీయం కాదు. ప్రపంచంలోనయితే ఏ వ్యక్తి షహాదత్ కలిమా (సాక్ష్య సద్ వచనం) నోటితో పలుకుతాడో మనం అతన్ని ముస్లిమ్‌గా అంగీకరిస్తాము. అతని ఎడల ముస్లిముల్లా వ్యవహరిస్తాము. అతను బాహాటంగా విస్పష్టమయిన తిరస్కారం చేయనంతవరకు అతని పట్ల అలాగే ప్రవర్తిస్తాము. కాని అల్లాహ్ దృష్టిలో మటుకు ఏ వ్యక్తి అయితే తన బుద్ధీ జ్ఞానాల మేరకు, తాను పలుకుతూ దేన్ని తిరస్కరిస్తున్నాడో, మరి దేన్ని అంగీకరిస్తున్నాడో గ్రహించి, అర్థం చేసుకుంటూ పలుకుతున్నాడో అతడే విశ్వసించిన వారిలా పరిగణించబడతాడు.

ద్వితీయంగా, దీనివల్ల సాక్ష్య చట్టానికి సంబంధించిన ఒక నియమం ముందుకు వస్తుంది, దాని ప్రకారం సాక్ష్యం పలకడానికి జ్ఞానం అవసరం అన్నది ఒక షరతు. సాక్షి ఏ సంఘటనకు సాక్ష్యం పలుకుతున్నాడో, దాన్ని గురించి అతనికి తెలియకపోతే అంటే అతనికి దాని జ్ఞానం లేకపోతే అతని సాక్ష్యం అర్థరహితం. ఇదే విషయాన్ని ప్రవక్త మహనీయులు (స) చేసిన ఒక తీర్పు విషయంలోనూ ద్యోతకమవుతుంది. ఆయన ఒక సాక్షిని ఇలా పురమాయించారు, "నీవు ఒకవేళ ఆ సంఘటనను స్వయంగా నీ కళ్ళతో, నీవు సూర్యుణ్ణి చూస్తూ ఉన్నట్లు చూసినట్లయితే సాక్ష్యం పలుకు లేకపోతే వదలివెయ్యి." (అహ్కాముల్ ఖుర్ఆన్ – జస్సాస్)

69. దీనికి రెండు అర్థాలు. ఒకటి, వీరిని ఎవరు పుట్టించారు అని నీవు వీరిని అడిగినట్లయితే, వీరు 'అల్లాహ్' అని అంటారు. రెండు, వీరి ఆరాధ్యుల్ని ఎవరు పుట్టించారు అని వీరిని అడిగినట్లయితే, వీరు 'అల్లాహ్' అని చెబుతారు.

70. ఇది దివ్య ఖుర్ఆన్‌లోని అతి సంక్లిష్టమయిన ఆయత్‌లలో ఒకటి. ఇందులో వ్యాకరణ విశ్లేషణకు సంబంధించిన ఎంతో చిక్కులతో కూడుకున్న ఒక ప్రశ్న ఉత్పన్నమవుతుంది. (వ కీలిహీ) లోని పదం 'వావ్' కు భావం 'ఏమిటీ' అన్నది. పైన వస్తున్న ప్రసంగ పరంపరలో దీని సంబంధం ఏ విషయంతో ఏర్పడుతుంది అన్న విషయంలో వ్యాఖ్యాతలు సుదీర్ఘమయిన చర్చలు జరిపారు. కాని సంతృప్తికరమయిన మాట ఏదీ తేల్చి చెప్పినట్లు నాకు దొరకలేదు. నా దృష్టిలో అన్నింటి కంటే సవ్యమయిన మాట, షా అబ్దుల్ కాదిర్ గారి అనువాదం వల్ల ద్యోతకమయ్యేదే. అంటే ఇందులోని 'వ' (వావ్) సముచ్చయ ప్రత్యయం కాదు, ఇది ప్రమాణం (ఒట్టు) కు ప్రయోగించే 'వావ్'. దీని సంబంధం, దీనికి పూర్వపు ఆయత్‌లోని చివరి పదం **ఫఅన్నాయూఫకూన్**తో ఉంది. **వఖీలిహీ**లోని సర్వనామం దైవ సందేశహరులను సూచిస్తుంది. దీన్ని 'ప్రభూ, ఈ జనులు విశ్వసించబోనివారు' అనే వాక్యం స్పష్టంగా నిరూపిస్తుంది. ఆయత్ భావమేమిటంటే,

దైవ సందేశహరుని మాట మీద ఒట్టు, ఆయన ఇలా అన్నారు, "ప్రభూ, ఈ జనులు అసలు విశ్వసించనే విశ్వసించనివారు." ఎంత వింతయినది ఈ జనులు మోసపోవడం! స్వయంగా వారే అంగీకరిస్తారు, తమను, తమ ఆరాధ్యులను సృష్టించిన వాడు పరమ ప్రభువు అల్లాహ్ మాత్రమే అని. అయినా సృష్టికర్తను కాదని సృష్టితాలనే ఆరాధిస్తామని పట్టుపడుతున్నారు.

దైవసందేశహరుడు పలికిన ఈ మాటపైన ప్రమాణం చెయ్యడంలో ఉద్దేశం ఏమిటంటే, ఈ జనుల వైఖరి వల్ల అతి స్పష్టంగా తేలిపోతోంది, వీరు వాస్తవంగానే మొండి జనం అని. ఎందుకంటే వారి వైఖరి అసమంజసమయిందన్నది, స్వయంగా వారి అంగీకారం వల్లనే తెలుస్తోంది. ఇటువంటి అసమంజసమయిన వైఖరి అవలంబించేవాడు కేవలం నమ్మరాదని నిర్ణయించుకు కూర్చున్నవాడే. మరోమాటలో చెప్పాలంటే ఈ ప్రమాణానికి అర్థం, దైవ సందేశహరుడు సరిగ్గానే చెప్పాడు, నిజంగానే వీరు అంగీకరించే జనం కారు.

71. అంటే, వీరి కఠినమయిన మాటలు, ఎగతాళి, పరిహాసాలకు వీరిని అభిశపించకు, మరి వీరికి సమాధానంగా ఎటువంటి కఠినమయిన మాటనూ పలుకకు. కేవలం సలామ్ చెప్పి వారిని తప్పించుకుని వేరయిపో.

**(సమాప్తం)**

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِيْ

## 4. యుద్ధాల ప్రకరణం

(కితాబుల్ మగాజీ)

## ప్రవక్త (స) సహచరమాన్యుల ఔన్నత్యం

### అధ్యాయం : 19

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: మీలో కొందరు శత్రువును మార్కొనే రోజున వెన్ను చూపారు. వారి ఈ పొరపాటుకు కారణ మేమిటంటే, వారిలోని కొన్ని బలహీనతల వల్ల షైతాను వారి పాదాలను చలింపజేశాడు. అయినా అల్లాహ్ వారిని క్షమించాడు. అల్లాహ్ అధికంగా క్షమించేవాడు, సహించేవాడూను. (ఆలి ఇమ్రాన్ : 155)

**677)** ఉస్మాన్ బిన్ మౌహబ్ కథనం: ఒక వ్యక్తి బైతుల్లాహ్‌ను సందర్శించి హజ్జ్ చేసుకోవడానికి (మక్కా) వచ్చాడు. అక్కడ కొంతమంది కూర్చుని ఉండటం చూసి, ఇక్కడ కూర్చుని ఉన్నవారెవరు? అని అతనడిగాడు. 'వీరు ఖురైషులు' అని జనులు చెప్పారు. 'వీరందరిలోకీ వృద్ధుడు ఎవరు?' అని ఆ వ్యక్తి ప్రశ్నించగా, 'అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)' అని జనులు జవాబిచ్చారు.

ఆ వ్యక్తి అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) దగ్గరకు వచ్చి, 'నేను మీకొక విషయం అడుగుతాను. మీరు నాకు (డొంక తిరుగుడుగా కాకుండా) సూటిగా సమాధానం ఇవ్వండి. ఈ గృహం(కాబా) పవిత్రత మీద ఒట్టేసి మరీ మిమ్మల్ని అడుగుతున్నాను. ఉహుద్ యుద్ధం జరిగిననాడు ఉస్మాన్-రజి-ధైర్యం కోల్పోయి వెనుకంజ వేసిన సంగతి నిజమేనా?' అని అడిగాడు. దానికి ఆయన, 'అవును, నిజమే' అని బదులిచ్చారు. 'ఉస్మాన్(రజి) బద్ర్ యుద్ధంలో పాల్గొనలేదన్న విషయం కూడా మీకు తెలిసే ఉండాలి' అని ఆ వ్యక్తి అడగ్గా, 'అవు న'ని ఆయన జవాబిచ్చారు. 'ఉస్మాన్-రజి-బైఅతె రిజ్వాన్‌లోనూ (హుదైబియా ఒడంబడిక సందర్భంగా) వెనుకంజ వేశారు, ఆ ప్రతిజ్ఞలో ఆయన పాల్గొనలేదు. ఇది కూడా మీకు తెలుసను కుంటాను' అని ఆ వ్యక్తి ప్రశ్నించగా, 'అవును, ఈ విషయం కూడా నిజమే' అని ఇబ్నె ఉమర్(రజి) బదులిచ్చారు. ఈ మాట వినగానే ఆ వ్యక్తి (సంతోషాన్ని పట్టలేక) 'అల్లాహు అక్బర్' అని పలికాడు.

అప్పుడు ఇబ్నె ఉమర్(రజి) ఆ వ్యక్తిని, 'ఇలా దగ్గరకు రా. నువ్వు వేసిన ప్రశ్నలన్నింటికీ విపులంగా సమాధానం ఇస్తాన'న్నారు. ఉహుద్ యుద్ధ సందర్భంగా పరారవటం గురించి నీవు అడిగావు. అయితే అల్లాహ్ ఆయన గారి ఆ తప్పిదాన్ని మన్నించాడు. ఇక బద్ర్ యుద్ధంలో ఆయన పాల్గొనలేకపోవడానికి కారణం ఏమంటే, ఆయన వివాహ బంధంలో ఉన్న దైవప్రవక్త పుత్రిక (రుఖయ్యా-ర.అ) ఆ సమయంలో అస్వస్థతకు గురై ఉంది. అందువల్ల దైవప్రవక్త(స) ఆయనకు సెలవు ఇస్తూ, "బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారికి లభించినంత పుణ్యం నీకూ లభిస్తుంది. వారికి సమానంగా యుద్ధప్రాప్తిలో నీకూ వాటా లభిస్తుంది" అని చెప్పారు. ఇక 'బైఅతె రిజ్వాన్'లో ఉస్మాన్(రజి) పాల్గొనలేకపోవటం గురించి అంటావా, ఖురైషుల దృష్టిలో ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(రజి) కన్నా ఎక్కువగా అందరికీ ఆమోదయోగ్యమైన వ్యక్తి ఉండి ఉంటే బహుశా అలాంటి వ్యక్తిని దైవప్రవక్త(స) మక్కా నగరానికి పంపి ఉండేవారు. కాని అలాంటి వారెవరూ లేకపోవటం చేత దైవప్రవక్త(స) ఉస్మాన్‌నే మక్కాకు పంపవలసి వచ్చింది. ఉస్మాన్(రజి) మక్కా నగరంలో ఉన్న సమయంలో 'బైఅతె రిజ్వాన్' ప్రతిజ్ఞ జరిగింది. దైవప్రవక్త(స) తన కుడి చేతిని పైకెత్తి "ఇది ఉస్మాన్ చేయి" అని పలికారు. దానిని (ఎడమ) చేతిపై కొడుతూ, "ఈ బైఅత్ ఉస్మాన్ (రజి) తరపున" అని కూడా పలికారు. (అర్థమయిందా?) ఇక నీవు వెళ్ళవచ్చు. అయితే నేను చెప్పినదంతా జ్ఞాపకం ఉంచుకో[1] అని ఇబ్నె ఉమర్ హితబోధ చేశారు.

*677-1. మహనీయ ఉస్మాన్(రజి)పై ఆక్షేపణలు లేవనెత్తిన ఆ వ్యక్తి ఖారిజీ వర్గానికి చెందినవాడు. అతను స్థూలదృష్టితో సంఘటనలను ప్రస్తావించి ఎదుటి వారిని తప్పుదోవ పట్టించజూశాడు. కాని అల్లాహ్ గౌరవమొసగిన వ్యక్తి గురించి చెడుగా చెప్పేవాడే నిజానికి చెడ్డవాడు.*

*ఉహుద్ యుద్ధ సందర్భంగా ఒక్క ఉస్మాన్(రజి) మాత్రమేగాక, అనేక మంది సహచరమాన్యులు చెల్లాచెదురైపోయారు. వారి తప్పును అల్లాహ్ స్వయంగా మన్నించినపుడు, ఇక దానిపై తప్పులెన్నే అర్హత ఎవరికీ లేదు. ప్రశ్నలు వేసిన వ్యక్తికి మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) విపులంగా సమాధానపరిచారు. కాని ఆంతర్యంలో అక్కసు ఉన్నవారికి విషయం అంత తొందరగా బుర్రకెక్కదు. ఇలాంటి వక్రబుద్ధి గలవారు ఇప్పటికీ ఉన్నారు. మహాప్రవక్త ప్రియసహచరులు (రజిఅల్లాహు అన్హుం), మరీ ముఖ్యంగా నలుగురు మార్గదర్శక ఖలీఫాలు మనందరి కొరకు గౌరవనీయులు. వారి వల్ల ఎప్పుడైనా, ఎక్కడయినా ఏదైనా పొరపాటు జరిగి ఉంటే ఆ విషయం దైవాధీనం. తప్పులెన్నే హక్కు మనకు లేదు.*

# పరలోక భావన : ఇస్లామ్‌లో...

**-ఎస్.ఎమ్.మలిక్**

**మరణానంతరం** మరో జీవితం లభిస్తుందా లేదా అంతటితో మానవ మనుగడ అంతమయి పోతుందా? ఈ ప్రశ్న మానవుణ్ణి, అతని మేథను సదా తికమకకు గురిచేస్తూ వచ్చింది. నేటి అత్యాధునిక కాలంలో, విజ్ఞాన శాస్త్రం మనిషిని గగనతలంలో విహరించడానికే కాక, మనిషి తాను నివసించే భూమి లోతు పాతుల్లోని రహస్యాలు కనుగొనడానికీ ప్రోత్సహిస్తున్న కాలంలో, మనిషి తన పుట్టుపూర్వోత్తరాలను గురించి ఆరా తీసి సృష్టి రహస్యాన్నే ఛేదించడానికి ఉద్యుక్తుడవుతున్న ఈ కాలంలోనూ- మరణానంతరం మరో జీవితం మనిషికి లభిస్తుందా అన్న ప్రశ్న అపరిష్కృతంగానే మిగిలి ఉంది!

### అంతుచిక్కని ప్రశ్నలు

మనిషి ఎలా ఉనికిలోకి వచ్చాడు, భూమికీ, గగనతలంలో భూమి పైన కాలాన్ని పగలు, రేయి, సూర్యోదయం, అస్తమయం, చంద్రోదయం, చంద్రుడు ఎకాఎకిన మాయమయి తిరిగి అనేక గంటలుగా లెక్కింపబడే కాలప్రమాణం తరువాత దర్శన మివ్వడం- ఏమిటిదంతా?

నేలపైని కొండలు, చెట్లు, నదులు, జంతువులు, మనిషి- మానవుడు, జంతువులు, చెట్లు- ఇవి సాధించే పునరుత్పత్తి, ఏమిటీ చోద్యం?

సృష్టిరాశుల్లో 'ప్రాణం' అనే పదార్థం ఏమిటీ? ప్రాణమున్న జీవరాశుల్లో మనిషి ఆలోచించగలగటం, నిర్ణయాలు గైకొన గలగటం, మరే సృష్టికీ సాధ్యంకాని ఓ మహత్తర సామర్థ్యం- మాటలాడటం- మనిషికి మాత్రమే అబ్బటం ఏమిటీ- ఏమిటి ఇదంతా? మనిషి ఆలోచనకు మేథో విహారానికి అందని ప్రశ్నలు, జవాబులు దొరకని ప్రశ్నలు!!

సకల సామర్థ్యాలు, సహస్రాది గుణవిశేషాలున్న ఈ మనిషికి కూడా అంతుపట్టని విషయాలు- మనిషి ఏ కాస్త పరికించినా పిచ్చెక్కించే ప్రశ్నలు! మనిషి వైజ్ఞానిక శాస్త్రాల ద్వారా ఎన్ని రహస్యాలు బట్టబయలు చేసినా ఇంకా అర్థంకాని చిక్కు ప్రశ్నలు; అనునిత్యం మనిషికి ఎదురొడ్డి, అతని మేథకు, బుద్ధీ జ్ఞానాలకు సవాళ్ళు విసిరే ప్రశ్నలు!!

### మతం

మనిషిలో, ఆలోచించే మనిషిలో, సహజంగానే ఉత్పన్నమయ్యే ఇలాంటి అనేకానేక ప్రశ్నలకు జవాబులు, ఎవరి వద్దా లేవని కాదు. 'మతం' అనే ఒకానొక అధి భౌతిక వ్యవస్థ వీటన్నింటికీ అతి స్పష్టంగా సమాధానాలు చెబుతుంది, అతి సులువుగానూ, ఎంతో బౌద్ధికంగానూ చెబుతుంది. రండి, పరిశీలిద్దాము.

### మతాలు!

మతాలను పరిశీలించదలిస్తే భిన్న మతాలు, విభిన్న వాదనలు ముందుకు వస్తాయి, మతాన్ని తెలుసుకోవాలనుకుంటే! దైవ సందేశం, దైవానికి, ప్రవక్తలు, గ్రంథాలు- వీటి ఆధారంగా కొన్ని

మతాలుంటే, కొన్ని మతాలేమో ఆచారాలు, వ్యవహారాలు, సంప్రదాయాల ఆధారంగా ఏర్పడ్డాయి. మరికొన్ని మతాలు వాటి స్థాపకుల కొన్ని బోధనల ఆధారంగా రూపొందాయి.

వీటిలో అత్యధికంగా దాదాపు అన్నీ, ఒక విషయాన్ని ఒప్పుకుంటాయి. భూమ్యాకాశాలు అన్నింటినీ, మనిషి కంటికి కనపడేవన్నింటినీ, కనబడని వాటినీ సృష్టించిన శక్తి, అస్తిత్వం ఒకటుంది. ఆ సృష్టికర్తను దైవం అని, ఆ దైవానికి అపారమయిన శక్తులున్నాయని, ఆ దైవానికి ఆలోచించే మనిషి ఆంతర్యాల్లోకి చొరబడి అక్కడ జరిగే ఆలోచనా కార్యక్రమాలను సయితం పసిగట్టగల శక్తి కూడా ఉందని, ఆ శక్తి, ఆ వ్యక్తిత్వం మనిషి జననాన్ని, జీవితాన్ని మృత్యువునూ నిర్దేశిస్తుందని కూడా అన్ని మతాలు అంగీకరిస్తాయి.

అయితే మరణం తరువాత జరిగే దాని విషయంలో భేదాభిప్రాయాలు ఈ మతాలకు ఉన్నాయి. ఆ వివరాలు అటుంచి ప్రస్తుతం కేవలం ఇస్లామ్ వివరించే దాన్ని పరిశీలిద్దాము.

## ఇస్లామ్

ఇస్లామ్ అధ్యయనం మొదలెడితే అది, దైవం, దైవ సందేశం, సృష్టి, మనిషి- మనిషి జనన మరణాలు, మనిషి జీవన వ్యవస్థ- ప్రతి దాన్ని గురించి అతి క్షుణ్ణంగా, సవివరంగా, బుద్ధికందేలా, ఆచరణాత్మకంగా చర్చిస్తుంది.

ఈ విశ్వ కళాఖండాన్ని దైవం తన పథకం ప్రకారం, ఎంతో సుందరంగా తీర్చిదిద్ది మరీ సృజించాడని, ఆ పథకం ప్రకారమే మనిషి రూపకల్పన, నేలపైన అతని పాత్రతో సహా సవివరంగా సర్వం నిర్ణయించబడ్డాయని, ఇస్లామ్ ప్రధాన మౌలిక ఆధారం, దైవగ్రంథం కుర్‌ఆన్‌లో పేర్కొనడం జరిగింది. మానవ జీవన పరమార్థాన్ని సూచిస్తూ కుర్‌ఆన్, ఈ జీవితాన్ని ఇహలోకంలో గడిపి, తన పాత్రను పోషించి మరణాన్ని ఆశ్రయించిన మనిషిని గురించి ఇలా ప్రస్తావిస్తుంది :

కడకు ప్రతి వ్యక్తి మరణించవలసిందే, మరి మీరంతా మీ ప్రతిఫలాలు పూర్తిగా ప్రళయదినాన పొందనున్నారు. అక్కడ ఎవరయితే నరకాగ్ని నుండి రక్షింపబడతాడో, మరి స్వర్గంలో ప్రవేశింపజేయబడతాడో అతనే నిజానికి సాఫల్యం పొందినవాడు. మరి ప్రపంచ జీవితం మాటకు వస్తే ఇది కేవలం బాహ్య పటాటోపం, వంచనా ప్రధానం. (ఆలె ఇమ్రాన్ 4: 185)

అంటే ఇహలోకం పట్టించుకోతగింది కాదని, పరలోక సాఫల్యమే పరమార్థమని, అందువల్ల ఈ ఇహలోక జీవితం త్యజించి వేయాలని అర్థం కాదు, కుర్‌ఆన్‌ని అందజేసిన ప్రవక్త ముహమ్మద్(స) ఇలా బోధించారు : “ఈ ప్రపంచ జీవితం పరలోకపు భూమి.” మానవ జీవితాన్ని పంట భూమిగా నిర్వచించడమంటే ఇక్కడ కృషీవలునిలా కష్టపడి, పరలోకం కొరకు సత్కార్యాల పంటను పండించుకోవాలని అర్థం.

ఈ సందర్భంలో దివ్య కుర్‌ఆన్ చేసే ప్రకటన పరిశీలించదగింది:

ఆ పరలోకంలోని ఉత్తమ నివాసమయితే మేము భువిలో తమ పెద్దరికాన్ని కాంక్షించని వారి కొరకు, కల్లోలం సృష్టించదలచనివారి కొరకు మాత్రమే ప్రత్యేకించనున్నాము. అంతిమ మేలయితే దైవం పట్ల ఆదరణతో చెడులకు దూరంగా మెలిగేవారి కొరకే! (అల్ కసస్: 28: 83)

## వాస్తవమా?

ఇంతకూ ఇస్లామ్ తెలిపే ఈ ‘పరలోకం’ వాస్తవమా లేదా బూటకమా? నిజానికి మనం దేన్నయితే వాస్తవమని అంటామో అది పంచేంద్రియాలకు గోచరించేదయి ఉండాలి.

- కళ్ళతో చూడాలి, చెవితో వినాలి, దాని వాసన, రుచి చూడగలగాలి.

- చెయ్యితో ముట్టుకోవాలి

- ఆచరణాత్మకంగా అనుభవంలోకి రావాలి.

కాని మన జీవితంలో అనేక విషయాలు ఈ ప్రమాణాలకు సరితూగకపోయినా మనం వాటిని బౌద్ధికంగా అంగీకరిస్తాము. హేతుబద్ధంగా తరచి గ్రహించగలుగుతాము. ఏదీ వీలుపడకపోతే తార్కికంగా చర్చించి తెలుసుకునే ప్రయత్నం చేస్తాము. అంతేకాని దాన్ని లేదని కొట్టిపారవేయలేము. మరీ ముఖ్యంగా పంచేంద్రియాలకు గోచరించని అధి భౌతిక (Meta Physical) విషయాలు. అంటే పరలోకం, మరణానంతర జీవితం ఇత్యాది తెలియని విషయాలు. అవి మనకు తెలియనంత మాత్రాన అవి వాస్తవాలు కావని అనలేము. ఇదే సమంజసమయిన మార్గం కూడా.

మనిషి బుద్ధీ జ్ఞానాలు పరిమితమయినవి. అన్నింటినీ కేవలం తార్కికంగా ఆలోచించి మనకు తెలియని విషయాలనన్నింటినీ అర్థం చేసుకోలేము. అందువల్లనే ఇటువంటి విషయాలలో తెలిసిన వారిపైన ఆధారపడటం తప్ప మార్గాంతరం లేదు. ఇటువంటి దశలోనే మతం మనకు తోడ్పడుతుంది. కుర్‌ఆన్ ఇలా దారి చూపుతుంది, దాని ప్రకారం,

పరీక్ష-

ప్రపంచ జీవితకాలం ఓ పరీక్షా వ్యవధి. మనిషి దైవాన్ని తెలుసుకుని, దైవాజ్ఞాబద్ధుడయి జీవిస్తాడా లేదా దైవ ధిక్కారిగా జీవితం గడుపుతాడా? అన్నదే పరీక్ష.

**ఆయన (అల్లాహ్) మహోన్నతుడు, శుభప్రదుడు. ఆయన అధీనంలోనే విశ్వ మహాసామ్రాజ్యముంది. ఆయన ప్రతి విషయంలోనూ ఆధిక్యత గలవాడు. ఆయన మృత్యువునూ, జీవితాన్నీ సృజించాడు, తద్వారా మీలో ఎవరు ఉత్తమ ఆచరణ చేసేవారో మిమ్మల్ని పరీక్షించి చూడాలని. (అల్ ముల్క్ 67: 1,2)**

పైనుదహరించిన దివ్య కుర్ఆన్ వచనాల ద్వారా తెలిసినదాన్ని బట్టి, ఈ జీవితం- మనిషి మరణంతో ముగియదు, ఇది అనంత జీవితం. ఈ అనంత జీవితంలో ఓ చిన్న భాగమే ఈ ప్రపంచ జీవితం. ఇహలోక జీవితం కేవలం ఓ ఆచరణా వ్యవధి, పరీక్షా కాలం. మనిషి ఈ ఆచరణకు లెక్క చూపవలసి ఉంది. అప్పుడు ఆ విచారణ, పరీక్షలో పాసయినవారే సాఫల్యం పొందినవారు. తమ మిగతా జీవితం, శాశ్వత జీవితంలో సుఖసంతోషాలను అనుభవిస్తారు. ఫేలయినవారు మిగతా శాశ్వత జీవితంలో సర్వం కోల్పోయినవారు.

దివ్య కుర్ఆన్ మరో చోట ఇలాంటి వారి ప్రస్తావన ఈ విధంగా చేస్తుంది :

**నీవు ఆశ్చర్యపడవలసిన మాట ఏమయినా ఉంటే అది ఇదే. వారు విచిత్రంగా ఇలా అంటారు: "మేము మరణించి మట్టిలో కలసిపోయిన తరువాత, మళ్ళీ సరికొత్తగా సృష్టించబడతామా?" వీరే తమ ప్రభువును తిరస్కరించినవారు. (అర్ రాద్ 13: 5)**

దీన్నిబట్టి తెలుస్తోంది, పరలోకం సంభవం కాదని అనడం వాస్తవానికి పరలోకాన్ని కాదు, అసలు దైవాన్నీ, దైవిక శక్తిసామర్థ్యాలను కాదనడం, ఆయన విజ్ఞతను కాదనడమే కాదు, ఆ దైవం, (దైవం మన్నించుగాక) ఎంత అవజ్ఞత గలవాడు, మనిషిని మట్టిలోనుంచి తిరిగి పుట్టించడం సాధ్యపడని విషయమనీ ఎరుగడు, ఎంత జ్ఞానహీనుడు! దైవం మన్నించుగాక. కుర్ఆన్ అంటుంది :

**మనిషి అంటాడు, "నిజంగా నేను మరణించినపుడు, మళ్ళీ నన్ను బ్రతికించి బయటికి తీసుకురావడం జరుగుతుందా?" అని. మనిషికి గుర్తులేదా, అతను ఏమీ కానపుడు, అతని ఉనికే లేనప్పుడు లేమి అవస్థ నుండి సృష్టించామని? (మర్యమ్ 19: 66,67)**

### ప్రకృతి నిదర్శనాలు

మనిషి ఉనికితోపాటు ప్రకృతిలోని నిదర్శనాల ద్వారా కూడా మనిషికి బోధపరిచే కృషి జరిగింది :

## ప్రవక్త ముహమ్మద్ (స) జీవిత ఘట్టాలు కళ్ళ ముందు దర్శిస్తాయి

### గీటురాయి సీరత్ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ



గీటురాయి సీరత్ ప్రత్యేక సంచికను జమాఅతె ఇస్లామీ హింద్ నంద్యాల శాఖ అధ్యక్షులు షేక్ అబ్దుల్ సమద్ స్థానిక కార్యాలయంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమద్ మాట్లాడుతూ "సర్వతోముఖ నాయకత్వం" ముఖ్యాంశంగా గీటురాయి సీరత్ ప్రత్యేక సంచికను 50 పేజీలతో ప్రచురించారని, ఈ వారపత్రికలో విలువైన వ్యాసాలు, ప్రవక్త ముహమ్మద్ (స) జీవిత ఘట్టాలను ఆవిష్కరిస్తూ రచయితలు సులభ శైలిలో అక్షర రూపం ఇచ్చారన్నారు. వ్యాసాలు, కథలు చదువుతుంటే ప్రవక్త ముహమ్మద్ (స) జీవిత ఘట్టాలు కళ్ళ ముందు కదలాడతాయన్నారు. ఇది ప్రతి ఒక్కరు చదవాల్సిన పత్రిక. సీరత్ ప్రత్యేక సంచికను అబ్దుల్ సమద్ పరిచయం చేసారు. ఈ కార్యక్రమంలో జేఐహెచ్ జిల్లా బాధ్యులు సి.యం.జకరియ్యా, నంద్యాల ముస్లిం జేఏసి గౌరవాధ్యక్షులు ఎస్ఎండి అబుల్లైస్, ఖిద్మత్ మేనేజర్ ముహమ్మద్ ఫయ్యాజ్, మోమిన్ గౌస్, జీ.జైనుల్లాహ్, ముహమ్మద్ యూనుస్, ముహమ్మద్ షఫీ, మార్కెట్ అర్షద్, నూరుల్ హఖ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయనే అల్లాహ్, వాయువుల్ని పంపుతాడు, అవి మేఘాలను పైకి లేపుకుపోతాయి. మేము వాటిని బీడు ప్రాంతానికి తీసుకు వెడతాము, వాటి ద్వారా మృతభూమి, చచ్చిపడివున్న నేలకు జీవం పోస్తాము. మరణించిన మానవుల్ని బ్రతికించడమూ ఇంతే. (ఫాతిర్ 35:9)

మానవుడు మరణించిన పిదప అతను శిలాజం (Fossil) అయిపోయినా దైవం అతన్ని మళ్ళీ బ్రతికించగలడనీ కుర్ఆన్ చాటుతుంది :

**వారిలా ప్రశ్నిస్తారు, "మేము కేవలం ఎముకల పంజరంగా మారిపోయినా, మట్టిగా మారిపోయినా, సరికొత్తగా మమ్మల్ని సృష్టించి లేపడం జరుగుతుందా?" అని- వారికి చెప్పు, "మీరు రాళ్ళుగా లేదా ఉక్కుగా మారిపోయినా, ఇంకా అంతకన్నా గట్టి పదార్థంగా, మీ ఆంతర్యంలో జీవం పోసుకోలేని మరే పదార్థంగా మారిపోయినా, (మీరు తప్పక సజీవులయి లేచి నిలబడతారు). వారు తప్పక తిరిగి ప్రశ్నిస్తారు, "మమ్మల్ని తిరిగి జీవితం వైపునకు మరలించే వాడెవడు?" అని. చెప్పు, "మిమ్మల్ని తొలిసారిగా, మీరు అసలే లేనప్పుడు, మిమ్మల్ని లేమి అవస్థ నుండి ఉనికిలోకి తెచ్చినవాడు" అని.**

**(బనీ ఇస్రాయీల్ 17: 49-51)**

మరోసారి మానవునికి అతని పుట్టుకను గురించి గుర్తుచేసి చెప్పడం జరుగుతుంది :

**మనిషి, తనను ఇట్టే వదలిపెట్టడం జరుగుతుందని అనుకుం టున్నాడా? అతను ఓ స్ఖలించబడే నీటి వంటి ఇంద్రియ బిందువులా ఉండేవాడు కాడా? దాన్ని తల్లి గర్భాశ్రయంలో స్ఖలించడం జరిగేది. ఆపైన అతను మాంసం ముద్ద అయ్యాడు. తరువాత దైవం అతని శరీర చట్రం చేసి అతని అవయవాలను పొందికగా కూర్చి అమర్చాడు. పిదప దానిద్వారా స్త్రీ పురుషుల రెండు రాశుల్ని తయారుచేశాడు- ఇటువంటి దైవానికి, మరణించిన వారిని తిరిగి బ్రతికించేందుకు శక్తి లేదా? (అల్ కియామ 75: 37-40)**

## సృష్టి లక్ష్యం

ఇదంతా బోధించిన తరువాత, మనిషి జీవితం, అతని జీవన లక్ష్యం ఏమిటో బోధపరచిన తరువాత ఈ సృష్టి కళ అంతా ఆశయరహితంగా ఇట్టే వేళాకోళంగా ఉనికిలోకి రాలేదని, దీనికీ ఓ లక్ష్యముందని తెలుపుతుంది దైవగ్రంథం, కుర్ఆన్ :

**మేము భూమ్యాకాశాలను, వీటిలో ఉనికి గలవాటన్నింటినీ సత్యం ఆధారంగా తప్ప మరే భూమికలో సృజించలేదు. నిశ్చయంగా తీర్పు జరిగే ఘడియ రానున్నది.**

**(అల్ హిజ్ర్ 15: 85)**

దైవగ్రంథం ద్వారా లభించిన ఈ బోధనలన్నింటి సారాంశం ఏమిటీ?

➢ మనిషి ఇహలోకంలో బాధ్యతాయుతుడయిన వ్యక్తిగా సృజించబడ్డాడు. మనిషే ఈ జగతి సృష్టికి మూలాంకురం. సృష్టి యావత్తు మనిషి సేవ కొరకు సృజించబడితే మనిషి దైవాన్ని, విశ్వప్రభువును, విశ్వ విరాట్టును సేవించడానికి, ఆయన అభీష్టాన్ని నెరవేర్చడానికి సృజించబడ్డాడు. అతను ఇక్కడ ఇష్టం వచ్చినట్టు మాటలాడటానికి, ఆకాంక్షల ఆధారంగా వ్యవహరించడానికి, కళ్ళెంలేని గుర్రంలా గెంతులు వేయడానికి అతను ఉనికిలోకి రాలేదు.

నిజమయిన దైవదాసుని ప్రత్యేకతలు :

➢ మనిషి ఏ పనిచేసినా దైవానికి సమాధానం చెప్పుకోవలసి ఉందన్న స్పృహతో, ఆ మెలకువతో ఆచితూచి మరీ వ్యవహరించ వలసి ఉంటుంది.

➢ ప్రతి వ్యక్తిలోనూ ఓ జగతి ఉంది. ఆ జగతికీ అవధుల్లేవు. అతని ఊహా పరిధులు సప్తాకాశాలనూ చేరగలవు. దైవం అతన్ని తన పేర్ల (అస్మా ఉల్ హుస్నా = సుందర నామములు) వలే అత్యుత్తమ రూపంలో (అహ్సను తక్వీమ్ = అత్యుత్తమ రూపం) సృజించాడు.

మానవుడు దైవ సృష్టికి ప్రతిరూపం కాబట్టి మనిషిలో దేవుని సృజనా శక్తులు, నిర్మాణ శక్తులు కూడా ఉన్నాయి.

➢ మనిషి సహజసిద్ధంగా దైవ గుణాలకు ప్రతిరూపం. ఎవ్వరికీ అన్యాయం చెయ్యడు. ఎన్నడూ అసత్యం, అబద్ధం పలుకడు. అధర్మంగా ఏ ప్రాణినీ, ఏ వ్యక్తినీ హింసించడు, చంపడు.

➢ మనిషి సహజసిద్ధంగా తన దాత, ప్రభువు వలే సదా అగత్యపరులను ఆదుకుంటాడు. తనకు ఉన్నదానిలో తన తోటి వారికి పంచిపెడతాడు.

➢ కలిమిలోనూ లేమిలోనూ మధ్యేమార్గాన్ని అనుసరిస్తాడు.

➢ ఎప్పుడూ అతివాదానికి దారివ్వడు.

పరలోక భావన గల వ్యక్తి, తాను విశ్వప్రభువుకు నేడు కాకపోయినా రేపు పరలోకంలో జవాబు చెప్పుకోవలసి ఉందన్న ప్రగాఢ నమ్మకమున్న మనిషి గుణగణాలు, వ్యవహారశైలి పైవిధంగా ఉంటాయి.

మనిషిలో మంచీ చెడులు రెండూ సక్రియగా ఉన్నాయి. కాబట్టి ఎప్పుడయినా ఎలాంటి దుర్బడతకు లోనయినా స్పృహ కలగగానే తన అసలు నైజం, దైవదాసుని నైజం వైపునకు మరలి, దైవానుగ్రహానికి పాత్రుడవుతూ ఉంటాడు నిజమయిన దేవుని దాసుడు.

# జ్ఞాన జ్యోతిని వెలిగించాలి...

# అజ్ఞాన పొరల్ని తొలగించాలి!

**- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ**

**జ్ఞానం -** జ్ఞానమే జీవన సారం, జ్ఞానమే సదా సాఫల్య ద్వారం, జ్ఞానమే సతతం సమున్నతికి సోపానం- ఇహంలోనూ, పరంలోనూ. జ్ఞానం కాంతి పుంజం. జ్ఞానం సూర్యగోళం. సూర్యుడు ఉదయించ గానే నీలి మేఘాలు బహు దూరాల నుంచి ముసురుకు వస్తాయి. వాయువు తోడయితే సూర్య ప్రకాశానికి తెరవేస్తాయి. జ్ఞాన ప్రభ భాసిల్లినప్పుడు మిథ్యాంధకారం అలుముకునేందుకు పరుగెడు తుంది. వాతావరణం సహకరిస్తే సత్యజ్ఞానాన్ని కప్పివేస్తుంది.

జ్ఞానం నిజమయింది. జ్ఞానం సహజమయింది. ప్రకృతి సిద్ధ మయింది. జ్ఞానజ్యోతిని కప్పి పెడితేనే అంధకారం ఆవరిస్తుంది- మనిషిలోనూ, సంఘంలోను. అంధకారాన్ని దూరం చెయ్యాలంటే జ్ఞాన కాంతిపైన కప్పుకున్న తెరల్ని, పొరల్ని చీల్చాలి... అప్పుడే అజ్ఞానపు చీకట్లు పటాపంచలవుతాయి.

జ్ఞానంతోనే జన జీవనంలో జాగృతి, జ్ఞానంతోనే జన జీవన స్రవంతిలో శాంతి. జ్ఞానంతోనే జాతుల పురోభివృద్ధి. జ్ఞానంతోనే జన గణ మన క్షేమ శ్రేయాలు. జ్ఞానం లేని జీవితం నిస్తేజం, నిర్జీవం, నిర్వీర్యం. సత్యజ్ఞానం లేని ఆంతర్యం దీపం లేని ఇల్లు. సత్యజ్ఞానం లేని హృదయం - జీవం లేని కళేబరం. సత్యజ్ఞానానికి స్పందించని గుండె చలనంలేని బండరాయి. సత్యజ్ఞానానికి పరితపించని మనస్సు కొడిగట్టిన దీపం.

జ్ఞానం ఎంతో గొప్పది. పరాత్పరుడైన అల్లాహ్‌యే దానికి మూలం. ఆయన నామాల్లో అలీమ్, ఆలిమ్, అల్లామ్ - జ్ఞాన, విజ్ఞాన మూలాల్ని సూచించేవే. అందరికీ జ్ఞానాన్ని ప్రసాదించేవాడు ఆయనే. కనుక జ్ఞానప్రాప్తి కోసం ఆయన్నే ప్రార్థించాలి. అగోచరాల జ్ఞానం ఆయనకు తప్ప మరెవరికీ లేదు. అందుకే దైవప్రవక్తలు సైతం జ్ఞానం ప్రసాదించమని ఆయన్నే వేడుకుంటారు.

దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: ప్రవక్తా! ఇలా అనండి: "ప్రభూ! నాకు మరింత జ్ఞానమొసగు." (తాహా: 114)

తెలిసినవారూ, తెలియనివారూ ఇరువురూ సమానులు కాగలరా? (జుమర్: 9)

అల్లాహ్ దాసులలో జ్ఞానులు మాత్రమే ఆయనకు భయపడతారు. (ఫాతిర్: 28)

అలాగే - మీలో విశ్వసించిన వారికి, జ్ఞానం ప్రసాదించ బడిన వారికి అల్లాహ్ ఉన్నత స్థానాలు ప్రసాదిస్తాడు. (ముజాదలహ్: 11)

జ్ఞానులూ- అజ్ఞానులూ, పండితులూ- పామరులు ఎన్నటికీ సమానులు కాలేరు. విశ్వాసులకు, జ్ఞానవంతులకు ఇహ పరాల్లోనూ గొప్ప హోదా, అంతస్తులు లభిస్తాయి. కేవలం పుస్తకాలు ఔపోసన పట్టినంతమాత్రాన మనుషులు పండితులు కారు. దైవభీతిపరులే సిసలైన పండితులు. విద్యకొద్దీ వినయమన్నట్టుగా జ్ఞానం పెరిగినకొలది మనిషిలో భక్తివిశ్వాసాలు పెంపొందాలి.

## ప్రవక్త (స) వారి మాటల్లో ధర్మ జ్ఞాన ఉపమానము

హజ్రత్ అబూ మూసా(రజి) కథనం ప్రకారం దైవప్రవక్త(స) ఇలా ప్రబోధించారు: అల్లాహ్ నాకిచ్చి పంపిన మార్గదర్శకత్వం, జ్ఞానాలు నేలపై కురిసే వర్షం లాంటివి. ఆ నేలలోని కొంతభాగం సారవంత మైనది. అది (వర్షపు నీటిని పీల్చుకొని పచ్చిక, చెట్లు చేమలను మొలకెత్తించింది. నెలలోని మరికొంత భాగం గట్టి నేల. అది (నీటిని పీల్చుకోలేక పోయినా) నిల్వచేసి మాత్రం ఉంచుతుంది. ఆ నీటితో అల్లాహ్ ప్రజలకు ప్రయోజనం చేకూర్చుతాడు. వారు ఆ నీటిని తాము స్వయంగా త్రాగటమే కాకుండా (తమ పశువులకు కూడా) త్రాపిస్తారు. ఇంకా పంట పొలాల కోసం కూడా వినియోగిస్తారు. మరోవైపు ఆ వర్షమే మెట్ట

పల్లాలు లేని చదునైన నేలపై కూడా కురిసింది. కాని ఆ నేల వర్షపు నీటిని నిలిపి ఉంచటంగాని, పచ్చికను మొలకెత్తించటం గాని చేయజాలదు. ఈ (తొలి రెండు) ఉదాహరణలు దైవధర్మాన్ని అర్థం చేసుకున్న వ్యక్తికి వర్తిస్తాయి. దేవుడు నాకిచ్చి పంపిన జ్ఞానం, సన్మార్గాలతో అతనికి ప్రయోజనం చేకూర్చాడు. అతను (స్వయంగా ధర్మ) జ్ఞానాన్ని ఆర్జించి (ఇతరులక్కూడా) దాన్ని బోధించాడు. ఇక (మూడవ) ఉదాహరణ దేవుడు నాకిచ్చి పంపిన (ధర్మం) వైపు తలెత్తి అయినా చూడకుండా, అల్లాహ్ నాకిచ్చి పంపిన సన్మార్గాన్ని తృణీకరించిన వాడికి వర్తిస్తుంది. (బుఖారీ-ముస్లిం)

## ప్రత్యక్ష జ్ఞానము - పరోక్ష జ్ఞానము

జ్ఞానం- నిప్పులో చేయి పెడితే కాలటం అనే నిప్పుకు సంబంధించిన నియమం చర్మం అనే ఇంద్రియం ద్వారా మనము తెలుసుకుంటాము. గాండ్రించేది పులి అనీ ఓండ్రించేది గాడిదనీ చెవులతో విని తెలుసుకొంటాము. అలాగే అనేక వివరాలు కళ్ళతో చూసి తెలుసుకుంటాము. మరికొంత సమాచారం ముక్కుతో నాలుకతో తెలుస్తుంది. ఇలా పంచేంద్రియాలు ప్రకృతిలో వస్తువులతో సంబంధంలోకి వచ్చినప్పుడు ఆయా వస్తువుల గురించి నేరుగా (ప్రత్యక్షంగా) తెలుసుకొంటాము.

అన్ని ప్రత్యక్షంగానే తెలుసుకోము. పరోక్షంగా కూడా అనేక విషయాలు తెలుసుకొంటాము. ఒక గ్లాసులో విషం పెట్టారనుకోండి. దీన్ని త్రాగితే చనిపోతారు అని ఎలా తెలుస్తుంది? అలా చనిపోయిన వారి ఉదాహరణల వల్ల వస్తుంది. ఇది ప్రత్యక్ష ప్రమాణాల వల్ల కాదు పరోక్ష ప్రమాణాల వల్ల లభించే పరోక్ష జ్ఞానం.

## జ్ఞానార్జన ప్రాముఖ్యత

చీకటి పోవాలంటే వెలుగు రావాలి. అజ్ఞానం పోవాలంటే జ్ఞానము అనే దీపం కావాలి. ఈ అజ్ఞానం నివాసం ఎక్కడ అంటే అది మన హృదయమే. దానినే మనసు, చిత్తము అని కూడా అంటారు. మన శత్రువులు ఎక్కడో లేరు మనలోనే ఉన్నారు అని అర్థం చేసుకోవాలి. మనం చేసే పొరపాట్లకు ఇతరులను నిందించేకంటే మనకు మనం ఆత్మవిమర్శ చేసుకోవాలి. హృదయములో తిష్ట వేసుకొని ఉన్న అజ్ఞానాన్ని అనుమానాలని మనమే నివృత్తి చేసుకోవాలి కానీ మరొకరు నివృత్తి చేయలేరు.

ఎలాగంటే మన నెత్తి మీద బరువును మరొకరు దించగలరు. మన అప్పు మరొకరు తీర్చగలరు. కాని మన కడుపులో ఉన్న ఆకలిని మనమే తీర్చుకోవాలి. మరొకరు తింటే మన ఆకలి తీరదు. అలాగే మన హృదయంలో ఉన్న అజ్ఞానాన్ని, అనుమానాలని మనమే నివృత్తి చేసుకోవాలి. దానికి జ్ఞానం సంపాదించాలి. అందుకే ప్రతి మనిషికి జ్ఞానం ఎంతో ముఖ్యమైనది అని నొక్కి వక్కాణిస్తుంది ఇస్లాం.

ముస్లిం అయిన ప్రతి స్త్రీ పురుషుని మీద విద్యార్జన జ్ఞాన సముపార్జన తప్పనిసరి విధి (బైహఖీ)

హజ్రత్ అనస్(రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: జ్ఞానార్జనా ధ్యేయంతో బయలుదేరిన వ్యక్తి తిరిగొచ్చే వరకు దైవమార్గంలో ఉన్నట్లుగానే పరిగణించబడతాడు. (తిర్మిజీ-హసన్)

దైవప్రవక్త (స) ఈ విధంగా ప్రబోధిస్తుండగా తాను విన్నానని హజ్రత్ అబూహురైరా (రజి) తెలియజేశారు: ప్రపంచం పాపిష్టిది, ప్రపంచంలో ఉన్నదంతా పాపిష్టిదే. దైవధ్యానం - దానికి సంబంధించినవి, ఇంకా ధర్మజ్ఞాని, జ్ఞానార్థి తప్ప! (తిర్మిజీ-హసన్)


**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

దైవప్రవక్త (స) ఇలా ప్రబోధిస్తుండగా తాను విన్నానని హజ్రత్ అబూ దర్దా (రజి) తెలియజేశారు: (ధర్మ) జ్ఞానాన్ని వెతుక్కుంటూ బయలుదేరే వారి కోసం దేవుడు వారు నడిచే మార్గం గుండా స్వర్గమార్గాన్ని సుగమం చేస్తాడు. విద్యార్థి చేసే పనుల పట్ల ప్రసన్నులై దైవదూతలు అతని గౌరవార్థం తమ రెక్కలు ముడుచుకుంటారు. భూమ్యాకాశాలలో ఉన్న వారు, ఆఖరికి నీళ్ళలో ఉండే చేపలు కూడా జ్ఞానుల మన్నింపు కోసం ప్రార్థిస్తూ ఉంటాయి. చంద్రునికి ఇతర నక్షత్రాల మీద ఎంత విశిష్ఠత ఉందో జ్ఞానులకు ఆరాధకుల మీద అంత విశిష్ఠత ఉంది. జ్ఞానులు దైవప్రవక్తల వారసులు. దైవప్రవక్తలు తమ వారసుల కోసం దీర్హంలు, దీనార్లు (మొదలగు ధనసంపదలు) వదలి వెళ్ళరు. వారు కేవలం జ్ఞానం మాత్రమే వదలి వెళ్తారు. కనుక ఎవరయితే ఆ జ్ఞానాన్ని నేర్చుకుంటారో వారు ఓ గొప్ప భాగ్యాన్ని పొందినట్లే. (అబూదావూద్, తిర్మిజీ)

## కళ్ళతో చూడాలి...కానీ, చెవులతో వినాలి కానీ..

కళ్ళకు రెప్పలు ఎందుకున్నాయంటే కళ్ళు తెరవడానికి, మూయ డానికి. చెవులకు రెప్పలు వున్నాయా? లేవు. ఎందుకంటే చెవులకు సమస్య లేదు. కళ్ళకే సమస్య వుంది కనుక కళ్ళకు రెప్పలు వున్నాయి. కళ్ళతో ఏమి సమస్య అంటే మనం పనికిరానివన్ని చూస్తూనే వుంటాము. కనుక కనురెప్పలు ఎందుకున్నాయంటే అవసరమైనప్పుడు మాత్రమే కళ్ళు తెరవండి. అవసరం లేనప్పుడు కనురెప్పలతో కళ్ళను మూసేయండి. అశ్లీల దృశ్యాలు, అనవసర విషయాలు చూడకూడదు. అంటే అవి పనికిరాని విషయం, చూడకూడని విషయం. నువ్వేం చేయాలి, నువ్వు ఏకాగ్రతతో దైవ ధ్యానంలా కూర్చోవాలి. దానికంటూ మన జీవితంలో కొంత సమయాన్ని తప్పక కేటాయించాలి.

మన చెవులు ఎప్పుడూ చెత్త మాటలు వినకూడదు. మన కళ్ళు ఎప్పుడు చెత్త దృశ్యాలు చూడకూడదు. మన పనులు మనవే. మన పనులు అయిన తరువాత మనం దైవ ధ్యానంలో నిమగ్నం కావాలి. కనుక నీ దైనందిన కార్యకలాపాలు ముగిశాక కఠోర ఆరాధనలో లీనమై నీ ప్రభువుపైనే మనస్సు లగ్నం చెయ్యి

(అలమ్ నష్రహ్:7-8)

ఎందుకంటే మనం కూడ ఒక సిద్దీఖ్ అబూ బకర్ (రజి)లా ఒక ఫారూఖ్ ఉమర్ (రజి)లా, ఒక గనీ ఉస్మాన్ (రజి)లా ఒక హజ్రత్ అలీ (రజి)లా కావాలి. కనుక గుర్తుంచు కోండి! పక్కింటి విషయాలు మీకు చెత్త. అలాగే, మీ ఇంటి విషయాలు పక్కింటివారికి చెత్త. చెత్త పేరితే వచ్చేది కంపు, ఆ కంపే కొందరికి మహా ఇంపు. అదే మనిషి పాలిట ముంపు, కాబట్టి ఇలాంటి వాటన్నింటినీ నిర్మోహమాటంగా తెంపు. లేదంటే తప్పదు నీకు తలవంపు.. కనుకనే దైవాదేశాలకు తలవంచు.

## దైవప్రవక్త (స) వారి మాటల్లో జ్ఞాన విభజన

అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (ర) కథనం: ప్రవక్త (స) ప్రవచనం, “జ్ఞానం మూడు రకాలు. 1) వివేకం నిండిన విస్పష్టమైన వచనం 2) ధృవీకరించబడిన దైవప్రవక్త దృఢమైన ప్రవచనం, సత్ సంప్రదాయం 3) న్యాయవంతమైన ధర్మ విధులు... ఇవి కాకుండా తక్కినవన్నీ అదనపు జ్ఞానం కోవకు చెందినవే. (అబూ-దావూద్, ఇబ్నె-మాజహ్)

## జ్ఞాన రకాలు

సర్వసృష్టికర్త అయిన నీ ప్రభువు పేరు స్మరించి పఠించు. ఆయనే మానవుడ్ని గడ్డకట్టిన రక్తంతో సృజించాడు. చదువు. నీ ప్రభువు మహోన్నతుడు. ఎంతో ఉదారుడు. ఆయన మానవునికి కలం ద్వారా అతను ఎరగని జ్ఞానం నేర్పాడు. (అల్-అలఖ్: 1-5)
కరుణామయుడే ఈ ఖుర్ఆన్‌ని (తన ప్రవక్తకు) నేర్పినవాడు. ఆయనే మానవుడ్ని సృష్టించి అతనికి మాట్లాడటం నేర్పాడు.

(రహ్మాన్: 2-5)

ప్రతీ మనిషికి అల్లాహ్ పుట్టుకతో ఇచ్చిన జ్ఞానం వుండనే ఉంటుంది. దాని పరిధిని మనుషులు వ్యాపింప చేసుకుంటారు. ఇది రెండు రకాలుగా చెప్పవచ్చు.

## 1) ప్రాపంచిక జ్ఞానం 2)పారమార్థిక జ్ఞానం

1) ప్రాపంచిక జ్ఞానం- మనిషి ప్రపంచంలో కుటుంబం, సమాజం, దేశం కొరకు ఉపయోగించే జ్ఞానాన్ని ప్రాపంచిక జ్ఞానం అంటారు. ఈ జ్ఞానం తక్కువ స్థాయి నుండి ఎక్కువ స్థాయి వరకు వుంటుంది. పేదవారికి తక్కువ స్థాయిలో వుంటుంది. ధనవంతులకు ఎక్కువ స్థాయిలో వుంటుంది. కీర్తి ప్రతిష్ఠలు గడించిన మహనీయులకు సర్వోన్నత స్థానంలో జ్ఞానం వుంటుంది.

2) పారమార్థిక జ్ఞానం- అల్లాహ్ సన్నిధికి చేరడానికి అవసరమైన జ్ఞానం. ఈ జ్ఞానం కోసం మనిషి స్థబ్ధత నుంచి చైతన్య స్థితికి రావాలి. ఆ తర్వాత నిశ్చలత్వాన్ని సాధించాలి. అలాంటి నిశ్చల స్థితిలో బుద్ధి, ఇంద్రియాలను నియంత్రిస్తుంది. మనిషిలోని మానసిక శక్తులన్నీ ఏకమౌతాయి.

మానవాత్మ సాక్షి! దాన్ని తీర్చిదిద్ది పాపపుణ్యాల్ని గురించి తెలిపినవాడి సాక్షి! నిస్సందేహంగా ఆత్మప్రక్షాళన చేసుకున్నవాడు ధన్యుడు. అంతరాత్మను అణచిపెట్టినవాడు నాశనమవుతాడు. (అష్-షమ్స్: 7-10)

(మిగతా వచ్చేవారం)

**రెండోసారి** మళ్ళీ ఆడపిల్ల పుట్టింది.

ఆనందంతో ఆసుపత్రిలో అందరికీ మిఠాయి పంచి పెట్టా.

ఆడపిల్ల పుడితే మూతి ముడిచే వారిని చూసాం కానీ, రెండోసారి కూడా ఆడపిల్ల పుడితే, వీడేందబ్బా మిఠాయి పంచుతున్నాడు? అని కొంతమంది ఆశ్చర్యంగా చూస్తున్నారు.

ఇద్దరు లేక ముగ్గురు అమ్మాయిలను పెంచి పోషించే వారికి దేవుడు స్వర్గాన్ని తప్పనిసరి చేసాడు. అని ప్రవక్త ముహమ్మద్ (స) తెలిపారు అని వారికి తెలియదు కదా.

ఇద్దరమ్మాయిలు చదువుల్లో, ధార్మిక పనుల్లో ముందుండటం చూసి లోలోన మురిసిపోతూ ఉండేవాడిని.

పండుగ వస్తే, నాన్నా! కొత్త బట్టలు ఎప్పుడూ కొనిస్తావు? అని ఎప్పుడూ అడగలేదు.

"నాన్న, నా క్లాస్మేట్‌కు అమ్మానాన్న లేరు. ఆమె చెప్పులు తెగిపోయాయి. ఆమెకు కొత్త చెప్పులు కొనిద్దాం" అని అడిగినప్పుడు తనకన్నా, తన తోటివారికి సహాయం చేయాలనే మనసు ఇచ్చినందుకు ఆ దైవానికి కృతజ్ఞతలు తెలియజేశా.

నా శాయశక్తులా ఉన్న దాంట్లో ఇద్దరు అమ్మాయిల్ని ఎలాంటి లోటూ రాకుండా పెంచా. ఒక ఇంటి వారిగా కూడా చేసా.

చిన్నదాని పెళ్ళైన సంవత్సరం తిరగకుండానే పండంటి ఆడపిల్లను బహుమతిగా ఇచ్చింది.

కాని రెండు నెలలు తిరగకుండానే నా చిన్నారిని దైవం తన దగ్గరకి పిలుచుకున్నాడు.

పుట్టిన ప్రతి వారు ఏదో ఒక రోజు మరణించి ఈ లోకాన్ని వీడి పోవాల్సిందే. ఈ సత్యాన్ని అవకాశం లభించినప్పుడల్లా అందరి ముందు ఉంచేవాడిని. కానీ నా సొంత కూతురు నాకన్నా ముందుగా వెళ్ళిపోవడం జీర్ణం కాలేదు.

ఒకవైపు చిన్న వయసులోనే తనకు కావలసిన పుణ్యకార్యాలు చేసుకుని వెళ్ళిపోయినందుకు సంతోషంగా ఉన్నా లోలోన ఏదో ఒక మూల తెలియని బాధ.


నా స్నేహితుడు ఒకాయన,"దేవుడు పెద్ద బొమ్మను తీసుకుని చిన్న బొమ్మను ఇచ్చి ఆడుకో అంటున్నాడు" అని అన్నప్పుడు,

నిజమే కదా, అని అనిపించింది.

"ఈ లౌకిక జీవితం ఒక ఆట. బాహ్య పటాటోపం. పరస్పరం సంతానం సంపదల విషయంలో ప్రగల్భాలు పలకడం తప్ప మరేమీ కాదు"

"ఈ లౌకిక జీవితం మాయ తడికల తట్టా తప్ప మరేమీ కాదు. అసలు జీవితం మరణానంతర జీవితం" అని అల్లాహ్ ఖురాన్‌లో చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి.

షేఖ్ అబ్దుల్ బాసిత్, కొత్తగూడెం



# నాన్నా... నన్ను మర్చిపోయావా?

కాలంతో పాటు కొన్ని విషయాలు మరచిపోవడం దైవం మనకు ఇచ్చిన గొప్ప వరం.

మొదట్లో రెండు సంవత్సరాల పాటు ప్రతి రోజూ ఖబ్రస్తాన్‌కి వెళ్ళి దుఆ (ప్రార్థన) చేసి వచ్చేవాడిని. కానీ మెల్లిమెల్లిగా రోజు విడిచి రోజు ఇప్పుడు వారంలో రెండుసార్లు వెళ్లి వస్తున్నా.

దుఆ ఎక్కడినుంచి అయినా చేయవచ్చు. కానీ ఎందుకో ఖబ్రస్తాన్‌కి వెళ్ళక పోతే,

"అబ్బాజీ నన్ను మరిచి పోయావా?" అని అడుగుతున్నట్లు అనిపిస్తుంది.

ఏంటో ఈ జీవితం. జీవితం శాశ్వతం కాదని తెలుసు. మూడు నాళ్ళ ముచ్చట అని తెలుసు. అయినా

బంధాలు అనుబంధాల మాయలో బందీ అయిపోతాం.

ఆత్మీయత అనుబంధం అంతా ఒక బూటకం. ఆత్మ తృప్తికై ఆడుకునే వింత నాటకం అన్నాడో కవి.

కానీ ఈ ఆత్మీయతా అనుబంధాలే మనల్ని శాశ్వత స్వర్గానికి అర్హత కలిగిస్తాయి అని ఇస్లాం చెబుతుంది.

నా చిట్టి తల్లి చేసిన మంచిపనులు చూసి, తెలిసి తెలియక చేసిన తప్పులు ఏమైనా ఉంటే మన్నించి స్వర్గాన్ని ప్రసాదించు ప్రభూ అని మీరు కూడా దుఆ చేయండి ప్లీజ్.



# శిక్షకుడిగా ముహమ్మద్(స)

- హుమేరా అమీర్

**"(ప్రభూ!) దోష రహితుడవు నీవే! నీవు తెలిపినది తప్ప మాకు మరేమీ తెలియదు. వాస్తవంగా సర్వం తెలిసినవాడవూ సర్వాన్ని అర్థం చేసుకోగలవాడవూ నీవే!" (దివ్య ఖుర్ఆన్ 2: 32)**

ఈ ప్రపంచంలోని సమస్త మానవాళి శ్రేయస్సు కోసం దైవం పంపిన జ్ఞానం మొత్తం అల్లాహ్ నుండి మాత్రమే మనకు లభించింది. ఇందులో ఏ ప్రవక్తకు, ఏ శాస్త్రజ్ఞుడికి, ఏ గురువుకు ఇసుమంత అయినా భాగస్వామ్యం లేదు. ఈ భువిపైన దైవం ద్వారా ఎన్నుకోబడ్డ ప్రవక్తలు చేసిన పని ఏమిటంటే, మనకు ప్రసాదించిన జ్ఞానాన్ని ఎక్కువ తక్కువలు కాకుండా మానవాళికి అర్థమయ్యే విధంగా బోధించారు. నేర్చుకోవడానికి, నేర్పించడానికి మనిషికి అవసరమైన అన్ని రకాల సాధనాలను, సామర్థ్యాలను అందించిన వాడు కూడా అల్లాహ్ మాత్రమే. ఆ సాధనాలను, సామర్థ్యాలను ఉపయోగించుకుని ప్రజలకు దైవ ధర్మాన్ని బోధించడానికి ప్రవక్తలు తమదైన ప్రత్యేక రీతులను, వ్యూహాలను అనుసరించారు. అందులో ముహమ్మద్ ప్రవక్త(స) వారి రీతి మరింత ప్రత్యేకం.

సాధారణంగా మనం ఉత్తమ శిక్షకుల గురించి మాట్లాడాలంటే మన ఆలోచనలు కేవలం ఒక అధికారిక గుర్తింపు పొందిన ఉత్తమ ఉపాధ్యాయుడి చుట్టూనే పరిభ్రమిస్తాయి. కానీ ఈ ప్రపంచ మానవ చరిత్రలో నీతి నియమాల శిక్షణ గానీ, ఆధ్యాత్మిక శిక్షణ గానీ, దైవ ధర్మ పరిపాలన గురించి గానీ, సత్య ధర్మ స్థాపన గురించి గానీ ఒక క్రమబద్ధమైన శిక్షణను ఉత్తమోత్తమ విధానంలో అందించినవారు ఎవరైనా ఉన్నారా అని ఆలోచిస్తే మాత్రం అది ఖచ్చితంగా ఆ శిక్షకుడు ముహమ్మద్ ప్రవక్త (స) మాత్రమే. ప్రపంచ మానవాళికి విద్యను అందించడానికి, వారిలోని అజ్ఞానాన్ని జ్ఞానంతో భర్తీ చేయడానికి ప్రవక్త ముహమ్మద్ (స)ను దైవం ఎన్నుకున్నాడు. ఆయన(స) ఒక 'గొప్ప గురువు' అనే దానికి పరిపూర్ణ ఉదాహరణ. ముహమ్మద్ ప్రవక్త (స) పోషించిన ప్రశంసనీయమైన పాత్ర మనకు ఖుర్ఆన్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. అత్యంత ప్రభావవంతమైన బోధన కోసం ఆయన(స) అనుసరించిన బోధనా వ్యూహాలను మనం కూడా నేర్చుకోవాలి.

పూర్తిగా భ్రష్టుపట్టిపోయిన సమాజాన్ని ఒక విజయవంతమైన, జాలి, దయ, సభ్యత కలిగిన సమాజంగా ఎలా మార్చారని ఆలోచిస్తే, ఆయన (స) బోధనలలో ఉపయోగించిన క్రమబద్ధమైన విధానాలు, పద్ధతులే అందుకు కారణం అని మనకు అర్థమవుతుంది. ప్రవక్త ముహమ్మద్ (స) తన పాఠాలను ప్రభావవంతంగానూ, ఉపయోగకరంగానూ మలచడానికి సమర్థవంతమైన బోధనా వ్యూహాలను ఉపయోగించేవారు. ఆయన (స) బోధనా శైలి స్ఫూర్తిదాయకంగానూ, శక్తివంతమైనదిగానూ ఉండి, తద్వారా అనుచరుల ఆలోచనల్లోనూ, మనస్సులోనూ నిక్షిప్తమయిపోయేది. అది వారి ప్రవర్తనపై ప్రభావం చూపించేది. ప్రవక్త ముహమ్మద్(స) వారి బోధనా వ్యూహాలు అనేక హదీసులలో చిత్రీకరించబడ్డాయి.

ఒక ఉపాధ్యాయుడిగా ప్రవక్త(స) ప్రత్యేక లక్షణాలను ముఖ్యంగా మూడు ప్రధాన భాగాలుగా వర్గీకరించవచ్చు. అవి ఆయన(స) వ్యక్తిత్వం, ఆయన ప్రసంగ విధానం, ఆయన చర్యలు, వ్యక్తిగతంగా చూస్తే ఆయన(స) మానసిక ప్రశాంతత, సరైన ఆలోచనా విధానం, తీక్షణమైన దూరదృష్టి కలిగి ఉన్నారు. హుదైబియా ఒప్పందం వంటి సందర్భాలలో మనం ఈ లక్షణాలను చూడవచ్చు. ఎన్ని కష్టాలు ఎదురైనా దృఢంగా, ఓర్పుతో

వ్యవహరించారు. కష్టాలకు కృంగిపోలేదు. పరిస్థితులకు లొంగి పోనూ లేదు. తన అనుచరులు తనకు ఎంతగా విధేయత చూపినప్పటికీ, కొంచెమైనా అహంకారానికి పోకుండా వినయ, విధేయతలతోనే వ్యవహరించారు. పేదలకు సహాయం చేసే విషయంలో గానీ, అవసరార్థులకు చేదోడు వాదోడుగా ఉండడంలో గానీ ఏనాడూ లోటు రానివ్వలేదు. సత్య సంధుడిగా, నిజాయితీపరుడిగా, ఇచ్చిన మాట నిలబెట్టుకునే వ్యక్తిగా, అమానత్‌లను అప్పగించే విషయంలోనూ అందరికీ ఆదర్శంగా నిలిచారు.

ప్రసంగం విషయానికి వస్తే, అది ఆయన(స) జ్ఞానంపై ఆధారపడింది. విషయాన్ని వివరించడంలో ఆయన నిపుణుడు. ఆయన (స) తను చెప్పే విషయంపై పూర్తి విశ్వాసం కలిగి ఉండే వారు. అల్లాహ్ ప్రవక్త (స)కు ఇచ్చిన అతి పెద్ద నైపుణ్యం "అమోఘమైన జ్ఞాపకశక్తి". ఆ కారణంగానే ఆయన (స) తనకు దైవం నుండి అందిన జ్ఞానాన్ని/ దివ్య ఖుర్‌ఆన్‌ను తు.చ. తప్పకుండా ప్రజలకు చేరవేయగలిగారు.

ముహమ్మద్ ప్రవక్త (స) అనుసరించిన కొన్ని బోధనా వ్యూహాలు ఇక్కడ ఇవ్వబడ్డాయి.

**పునరావృతం :** ప్రవక్త (స) ఒకే బోధనను ప్రజలకు మూడుసార్లు పునరావృతం చేసేవారు.

**దశలవారీగా బోధన :** ప్రవక్త (స) ఉపయోగించిన ముఖ్యమైన బోధనా పద్ధతుల్లో ఇది ఒకటి. బోధించేటప్పుడు లేదా సలహా ఇచ్చేటప్పుడు క్రమమైన విధానాన్ని అనుసరించేవారు. అలాగే జ్ఞానం సోపాన క్రమాన్ని గుర్తించేవారు. జ్ఞానార్జన చేసేవారి సామర్థ్యాన్ని గుర్తించి బోధించేవారు. తదుపరి భాగానికి వెళ్లే ముందు సహచరుల ఆసక్తిని బాగా గ్రహించి, అర్థం చేసుకోవడానికి అవకాశమిచ్చేవారు. అంతేకానీ, సహచరులకు అర్థం అయినా, కాకపోయినా నా బాధ్యత చెప్పడమే అనే ధోరణి ఆయనలో ఉండేది కాదు. ప్రతీ విషయాన్నీ విడమర్చి చెప్పేవారు. విషయాన్ని వివరించే ముందు సంబంధిత విషయాలపై దృష్టి పెట్టేవారు.

**సారూప్యతలు, ఉదాహరణలు :** ప్రవక్త ముహమ్మద్(స) ఒక అంశాన్ని మౌఖికంగా వివరించడానికి, తన అనుచరుల్లో ధర్మం పట్ల లోతైన అవగాహనను కలిగించడానికి, వారిలో దైవ ధర్మ స్థాపన పట్ల ఉత్సుకతను కలిగించడానికి సారూప్యతలు, ఉదాహరణలను ఉపయోగించేవారు. ఉదాహరణకు- దైవప్రవక్త (స) తన సహచరులను ఒక రోజు ఇలా అడిగారు, 'మీలో ఎవరైనా మీ గుమ్మం పక్కనే ఉన్న ఒక పారే నదిలో రోజుకు ఐదుసార్లు స్నానం చేస్తే, అతనిపై ఏదైనా మురికిని మీరు గమనించారా?' అని. అప్పుడు ఒక సహచరుడు బదులిచ్చాడు, "అతనిపై ఎటువంటి ధూళి ఉండదు" ప్రవక్తా అని. అంటే ఇక్కడ ప్రవక్త (స) అల్లాహ్ ఇచ్చిన నమాజు ఆజ్ఞను, నమాజు ప్రయోజనాలను తెలియజేయడానికి బదులుగా, ప్రవక్త (స) వారు రోజుకు ఐదుసార్లు స్నానం చేయడంతో పోల్చడం జరిగింది. రోజుకు 5 సార్లు స్నానం చేయడం వల్ల మనిషిపై ఎలాంటి మురికి లేకుండా ఏ విధంగా పరిశుద్ధుడవుతాడో, అదే విధంగా రోజుకు 5 సార్లు దైవాన్ని ప్రార్థించడం వల్ల మనిషి ఆధ్యాత్మికంగా, నైతికంగా ఎంతగా శుభ్రపడతాడో తెలియజేశారు. ప్రార్థనలు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను, ప్రార్థన ప్రాముఖ్యతను, ఆవశ్యకతను ప్రజలు బాగా అర్థం చేసుకోవడంలో ఈ ఉదాహరణ బాగా సహాయపడింది.

**స్వీయ జీవితమే ఒక రోల్ మోడల్ :** ప్రవక్త (స) స్వయంగా తన జీవితాన్నే ఒక అనుభవపూర్వకమైన ఉదాహరణగా, ఉత్కృష్టమైన తన జీవన విధానాన్నే ఒక ఉదాహరణగా ప్రపంచానికి చూపించారు. దైవప్రవక్తగా ఎన్నుకోబడడానికి ముందు ఆయన గడిపిన 40 సంవత్సరాల జీవితంలో కూడా మనకు ఆదర్శవంతమైన జీవితం కనిపిస్తుంది. ప్రవక్త ముహమ్మద్ (స) తన అనుచరులకు ఏదైతే బోధించేవారో ముందుగా ఆయన(స) స్వయంగా వాటిని ఎల్లప్పుడూ ఆచరించి చూపించేవారు. ఆయన (స) తన బోధనలకు విరుద్ధంగా ప్రవర్తించడం ఎన్నడూ జరగలేదు. జ్ఞాన ప్రాముఖ్యతను తెలియజేయడానికి, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో అల్లాహ్ ఆజ్ఞలను సులభంగా అమలు చేయడానికి వీలుగా ఆయన (స) తన స్వంత అనుభవాలను అందరితో పంచుకునేవారు.

ఈ ప్రపంచంలో ప్రతి వ్యక్తి తన జీవితానికి రోల్ మోడల్‌గా అనుసరించదగినవారు ఎవరైనా ఉన్నారంటే అది కేవలం ముహమ్మద్ ప్రవక్త (స) మాత్రమే. "వాస్తవంగానే అల్లాహ్ ప్రవక్తలో మీకు ఒక మంచి ఆదర్శం ఉండినది. అల్లాహ్‌పై, అంతిమ దినంపై ఆశలు పెట్టుకుని అత్యధికంగా అల్లాహ్‌ను స్మరించే ప్రతి వ్యక్తికి". (సూరా 33:21)

**దృష్టాంతాలు, ప్రదర్శనలు :** ప్రవక్త ముహమ్మద్ (స) ఒక అంశాన్ని గ్రాఫికల్గా చెప్పడానికి విషయాన్ని బోధించేటప్పుడు సులభమైన అవగాహన కోసం దృష్టాంతాల ద్వారా విషయాన్ని చెప్పేవారు. దీనివల్ల వినేవారి మెదడులో విషయం అద్భుతంగా నిక్షిప్తమయి పోయేది. ఒక సందర్భంలో ప్రవక్త (స) ఇసుక ద్వారా సరళ రేఖను గీశారు. తర్వాత మొదటి గీతకు కుడి వైపున, ఎడమ వైపున గీతలు గీశారు. ప్రజలు ఆ గీతల వైపు శ్రద్ధగా చూస్తున్నప్పుడు, ఆయన దివ్య ఖుర్‌ఆన్ వాక్యాన్ని పఠించారు, "నా రుజుమార్గం ఇదే. కనుక మీరు దీనిపైనే నడవండి. వేరే మార్గాలపై నడవకండి. ఎందుకంటే అవి మిమ్మల్ని ఆయన మార్గం నుండి తొలగించి విచ్చిన్న పరుస్తాయి. మీ ప్రభువు మీకు చేసిన హితోపదేశం ఇదే, బహుశా మీరు వక్రవైఖరికి దూరంగా ఉంటారని" (6:153)

మరో సందర్భంలో అనాథలను ఆదరించాలి అనే విషయం బోధించేటప్పుడు, "నేను, అనాథలను ఆదరించే వ్యక్తి స్వర్గంలో ఇలా ఉంటాం" అని ఆయన (స) తన చేతి చూపుడు వేలును, మధ్య వేలితో కలిపి చూపించేవారు. (బుఖారీ: 5304). అంటే ఇక్కడ అనాథల సంరక్షణ గురించి బోధిస్తూ, వారికి స్వర్గంలో లభించే ప్రతిఫలాన్ని కూడా కళ్ళకు కట్టినట్టు చూపించేవారు. ఆ కారణంగా ఎవరికైనా సరే తన చేతిని చూసుకున్న ప్రతీసారి, అల్లాహ్ ఆజ్ఞతో పాటు ఆ ఆజ్ఞను పాటించేవారికి స్వర్గంలో స్థానం కూడా గుర్తుకొస్తూ ఉంటుంది.

**బోధించేటప్పుడు ప్రశ్నలను అడగమని, సంభాషణలో పాల్గొనమని ప్రోత్సహించేవారు:** ప్రవక్త ముహమ్మద్ (స) తన సహచరులను ప్రశ్నలు అడగమని, చర్చల్లో పాల్గొనమని ప్రోత్సహించేవారు. ప్రవక్త(స) తన అనుచరులు అడిగిన ఎన్నో రకాల ప్రశ్నలకు సమాధానాలుగా చెప్పిన హదీసులు ఎన్నో ఉన్నాయి. ఉదాహరణకు, ఒక రోజు ఒక సహాబీ "ఓ అల్లాహ్ ప్రవక్తా! విశ్వాసులలో ఎవరు ఎక్కువ పుణ్యం కలవారు? అని అడిగిన ప్రశ్నకు సమాధానంగా ప్రవక్త (స) ఇలా అన్నారు, "ఎవరి నాలుక, చేతుల నుండి విశ్వాసులు సురక్షితంగా ఉంటారో వారే ఎక్కువ పుణ్యాత్ములు". (తిర్మీజి 2628).

ప్రవక్త (స) తనను ప్రశ్నలు అడగమని ప్రోత్సహించడమే కాదు, ఆయన (స) కూడా తన అనుచరులను ప్రశ్నలు అడుగుతూ ఉండేవారు. దానివల్ల సమాధానాన్ని పొందే ముందు లోతైన ఆలోచన చేసేవిధంగా వారిని ప్రేరేపించడం, అప్రమత్తం చేయడం జరిగేది. ఆయన (స) ప్రశ్నించేటప్పుడు సమాధానాలను వెతకాలనే కోరికను విద్యార్థుల్లో పెంచేవారు, తత్ఫలితంగా వారి ఆలోచనా ధోరణి పెరిగేది. వారు సమాధానం చెప్పలేని పరిస్థితిలో ప్రవక్త (స) వారే సమాధానం అందించేవారు. ఉదాహరణకు, "మీలో తన స్వంత సంపద కంటే తన వారసుల సంపదను తనకు అత్యంత ప్రియమైనదిగా భావించే వారు ఎవరున్నారు"? అని అడిగారు. దానికి వాళ్ళు, "అటువంటివాళ్ళు మాలో ఎవరూ లేరు, కానీ తన సొంత సంపదనే ఇష్టపడేవాళ్లు ఉన్నారు" అన్నారు. అప్పుడు, ప్రవక్త (స) ఇలా అన్నారు, 'ప్రతి ఒక్కరూ తన స్వంత సంపదను ఎక్కువగా ఇష్టపడతారు'. ఇంకా ఇలా అన్నారు. 'మీరు మీ మరణానికంటే ముందుగా ఖర్చు పెట్టి మీ కోసం పంపుకున్న దంతా మీ సంపద, మీ మరణానంతరం మీరు వదిలిపెట్టిన దంతా మీ వారసుడి సంపద". (బుఖారీ: 6442). సంపద గురించి ప్రవక్త (స) తన సహచరులను అడగడం ద్వారా, వారి దృష్టిని ఆకర్షించడమే కాకుండా వాళ్ళను ఆలోచనలో పడవేసేవారు. దాతృత్వం ప్రయోజనాలను తెలియజేయడానికి దాతృత్వం గురించిన జ్ఞానాన్ని మరింత బలంగా వారి హృదయాల్లో నాటడం జరిగేది.

ఏదైనా విషయాన్ని చెప్పేటప్పుడు వినేవారి దృష్టిని ఆకర్షించడానికి, వాళ్ళ ధ్యాసంతా మనం చెప్పే విషయం మీదనే ఫోకస్ చేయడానికి, చిన్న చిన్న గాథలు చెప్పడం అనేది ఒక ప్రభావవంతమైన మార్గం. అందుకే ప్రవక్త(స) తన సహచరులకు బోధించేటప్పుడు గాథలు చెప్పేవారు. ఉదాహరణకు, ప్రవక్త (స) ఇలా అన్నారు: "ఒక వ్యక్తి దారిలో వెళ్తూ ఉన్నప్పుడు అతనికి చాలా దాహం వేసింది. అతను ఒక బావి దగ్గరకు చేరుకోగానే, ఆ బావిలో దిగి దాహం తీర్చుకుని బయటకు వచ్చాడు. ఇంతలో అతను ఒక కుక్క విపరీతమైన దాహం కారణంగా కష్టంగా ఊపిరి పీల్చుకుంటూ నాలుకతో మట్టిని నాకడం చూశాడు. నాలాగే ఈ కుక్క కూడా దాహంతో బాధపడుతోంది కదా అని తనలో తానే అనుకుని, మళ్ళీ ఆ బావిలోకి దిగి, తన బూటుతో నీళ్లు తీసుకొచ్చి ఆ కుక్కకు త్రాగించాడు. అతను చేసిన పనికి అల్లాహ్ సంతోషించి అతనిని క్షమించాడు". (బుఖారీ: 2466). ఈ విధంగా గాథ ద్వారా ప్రబోధన మరింత చక్కగా గుర్తుండిపోయేలా చేసేవారు. అంతేకాదు ఈ గాథ ద్వారా జంతువులతో దయగా వ్యవహరించాలనే విషయం కూడా బోధించారు.

దైవ ప్రవక్తలను దైవం పంపించిన కారణం అల్లాహ్ ఆజ్ఞలను పాటిస్తూ కేవలం మంచి పనులు చేసేవారికి స్వర్గపు శుభవార్తలను అందించడానికి మాత్రమే కాదు దైవాజ్ఞలను పెడచెవిన పెట్టి, దైవానికి అవిధేయత చూపించేవారికి నరకం అనేది కూడా ఒకటి ఉంది. దాని నుండి తప్పించుకోవాలంటే అల్లాహ్ శరణువేడడం ఒక్కటే దారి అనే విషయాన్ని మానవులకు తెలియజేయడానికి కూడా ప్రవక్తలను పంపించడం జరిగింది. ఇదే విషయాన్ని దివ్య ఖుర్ఆన్‌లో వివరించడం జరిగింది.

"(ప్రవక్తా!) మేము నిన్ను సర్వమానవులకు శుభవార్తను ఇచ్చేవాడుగా, హెచ్చరిక చేసేవాడుగా నియమించి పంపాము. కాని చాలా మంది మానవులు దీనిని ఎరుగరు".

(దివ్య ఖుర్ఆన్: 34: 28)

అల్లాహ్ సందేశాన్ని వ్యాప్తి చేసే ఉద్దేశ్యంతో సమస్త మానవాళి కోసం ఆయన (స) ఎన్నుకోబడ్డారు. ప్రవక్త ముహమ్మద్ (స) తన ఆలోచనలు, భావాలు, ప్రవర్తన, బోధనలు, జీవిత అనుభవాల ద్వారా ఆదర్శవంతమైన శిక్షకులయ్యారు. ఆయన (స) మరణానికి ముందు ఏ విధంగా తన సహచరులకు శిక్షణ ఇచ్చారో, ఆయన (స) మరణం తర్వాత ఈ రోజుకీ ఆయన శిక్షణా పద్ధతులు, అభ్యాస అనుభవాలు ఆయన అనుచరులకు మాత్రమే కాదు ఇది ప్రపంచంలోని ఉపాధ్యాయులందరికీ స్ఫూర్తిదాయకం, శిరోధార్యం. ఎటువంటి సందేహాలు, లోపాలకు తావు లేకుండా ఆయన (స) బోధనలు ఉన్నాయి కాబట్టే ఆయన(స) బోధనా వ్యూహాలు నేటికీ స్ఫూర్తిదాయకంగానూ, ప్రయోజనకరంగానూ ఉన్నాయి. సమస్త మానవాళికి ఇవి అనుసరించదగ్గ విధానాలు.

❖

# నిరాడంబరత్వం!

- ముహమ్మద్ వహీదుద్దీన్

**మహనీయ ప్రవక్త ముహమ్మద్** (సల్లల్లాహు అలైహి వసల్లం) సమాజంలోని మానవులందరూ సమానమే అని, ఉచ్చ నీచ భేదాలను విడనాడాలని ఉద్బోధించారు. ఆడంబరంగా జీవితం గడపడాన్ని నిషేధించారు. ఆడంబరం చూపడం వల్ల సమాజంలో సమతుల్యం దెబ్బతింటుందని హెచ్చరించారు. అందుకోసమే ఒకచోట మహనీయ ప్రవక్త(స) "నిరాడంబరంగా జీవితం గడపడం కూడా విశ్వాసంలో ఒక భాగమే" అన్నారు. (అబూ దావూద్)

తినడం, త్రాగడం, కూర్చోవడం, లేవడం, కలసిమెలసి ఉండడం, ఇరుగు పొరుగు వారితో వ్యవహరించడం మొదలుకొని దుస్తులు ధరించటం, కుటుంబ వ్యవహారాల వరకు ప్రతి విషయంలోనూ మహాప్రవక్త మహితోక్తులు సమతుల్యానికి సంబంధించినవిగానే బోధపరుస్తున్నాయి.

మానవుడు సాధారణంగా తాను దుస్తులు ధరించడంలో ఆడంబరం చూపుతున్నాడు. ధనవంతుడు కూడా తన శక్తి మేరకు దుస్తులు ధరించాలని చెప్పారు. మహా ప్రవక్త (స) పరిశుభ్రతను, సంస్కారయుతంగా కనిపించడాన్ని కోరుకునేవారు. అలా ఉండటాన్ని ప్రోత్సహించేవారు. ఒక వ్యక్తి మహాప్రవక్త(స) సన్నిధికి వచ్చాడు. అతడు మాసిన బట్టలతో ఉన్నాడు. "మీకు బట్టలు శుభ్రపరచుకొనే తీరిక కూడా లేదా?" ఆయన అడిగారు. మరొక సందర్భంలో ఒక వ్యక్తి చినిగిన బట్టలు ధరించి ఉన్నాడు. అతనితో ఆయన(స) ఇలా విచారించారు, "మీ వద్ద ధనముందా?" అని ప్రశ్నించగా "అవును. ఉంది" అన్నాడు. దానికి మహాప్రవక్త(స) "నీకు అల్లాహ్ ఐశ్వర్యాన్ని ప్రసాదించినప్పుడు ఆయన కృపానుగ్రహాల ప్రభావం నీ శరీరంపైన వ్యక్తమవ్వాలి గదా!"

ధార్మిక జీవితం అంటే సంస్కార రహితంగా, అపరిశుభ్రంగా ఉండాలని కాదని, ఇస్లామ్ పారిశుధ్యాన్ని, సంస్కారాన్ని తెలిపే ధర్మం అని తెలుపుతోంది. మహాప్రవక్త (స) అతి సాధారణమైన జీవితాన్ని గడిపేవారు. ఒకసారి మహాప్రవక్త(స) మస్జిద్‌లో కూర్చుని ఉన్నారు. ఆ సమయాన ఒక వ్యక్తి ప్రవేశించాడు. అతని తల వెంట్రుకలు, గడ్డం అంతా చిందర వందరగా ఉంది. అప్పుడు మహాప్రవక్త (స) అతని తల, గడ్డం సరిగా దువ్వుకొని రమ్మని తమ చేత్తో సంజ్ఞ చేశారు. అతను అలాగే వెళ్ళి అంతా సంస్కరించుకొని తిరిగి వచ్చాడు. అప్పుడు ఆయన (స) "ఇది బాగుండలేదా? తల వెంట్రుకలు చిందరవందరగా ఉండి మనిషి ఒక షైతాన్‌లా కనబడడం కంటే?" అని అన్నారు. కేవలం ఆరాధన చెయ్యడమే కాదు. మన పరిశుభ్రత కూడా అవసరమన్నారు మహనీయ ప్రవక్త (స). తన గొప్పతనాన్ని చాటుకొనేందుకు, తన అధికార దర్పాన్ని ప్రదర్శించుకొనేందుకు దుస్తులు ధరిస్తున్న వారి విషయంలో మహాప్రవక్త (స) దైవాన్నుండి లభించే కఠిన శిక్షను ఇలా వివరించారు. "ఈ లోకంలో ఆడంబరమైన దుస్తులు ధరించేవారికి తీర్పుదినాన అల్లాహ్ అవమానకరమైన దుస్తులు ధరింపజేస్తాడని, దానిలో అగ్నిని ప్రేరేపింప జేస్తాడని హెచ్చరించడం జరిగింది. మనిషి తినడం లోనూ, త్రాగడంలోనూ చాలా స్వతంత్రంగా వ్యవహరిస్తాడు. కానీ మిగతా విషయాలను అంతగా పట్టించుకోడు. "ఈ లోకంలో ఏ కొరత లేకుండా జీవించిన వారు తీర్పుదినాన అందరికంటే అధికంగా ఆకలితో అలమటిస్తారు" అని మహాప్రవక్త తెలిపారు. అధికంగా తినడం వల్ల మనిషి అనారోగ్యం పాల్పడతాడు. వివిధ రకాల జబ్బులకు శరీరం నిలయమవుతుంది. శరీరం సమతుల్యతను కోల్పోతుంది.

స్త్రీలు అధికంగా బంగారు, వెండి వస్తువులను, ఆభరణాలను ఇష్టపడతారు. వీటిపై అధిక అభిమానాన్ని చూపటం కూడా మంచిది కాదు. దర్పంతో తమ గొప్పదనాన్ని – తమ ఆభరణాలు అలంకరించుకొని చాటుకోవడం మంచిది కాదన్నారు. తీర్పు దినాన అవి చాలా చెరుపు చేస్తాయని చెప్తూ వాటివల్ల కలిగే నష్టాన్ని తెలియజేశారు మహనీయ ప్రవక్త (స).

మహనీయ ప్రవక్త (స) అనుచరగణంలోని వ్యక్తి అయిన హజ్రత్ ఐస్ యమన్ గవర్నరుగా నియుక్తుడయినప్పుడు ఆయన (సఅసం) "ఓ ఐస్! నీవు కష్టపడేందుకు జంకవద్దు. దైవ దాసులు ఇహలోక సుఖాన్ని కాంక్షించరు" అని సలహా ఇచ్చారు. ఈ ఉద్దేశ్యంతోనే దైవ సందేశహరులు(స) బంగారు, వెండి పాత్రల్లో తినడం, తాగడం మంచిది కాదని బోధించారు. ఈ విషయాలన్నీ మహనీయ ప్రవక్త (సఅసం) తమ ప్రవచనాల్లో తెలియజేశారు.




## జమ్మూ కశ్మీర్‌కు 15 దేశాల దౌత్యవేత్తలు

జమ్మూ కశ్మీర్‌లో దాదాపు పదేళ్ల తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడి అసెంబ్లీ ఎన్నికలను తిలకించడానికి ఏకంగా 15 దేశాల దౌత్యవేత్తలు జమ్మూ కశ్మీర్‌కు తరలివచ్చారు. అమెరికా, నార్వే, ఫిలిప్పీన్స్, అల్జీరియా, స్పెయిన్, సౌత్ ఆఫ్రికా దేశాలతో పాటు మరికొన్ని దేశాలకు చెందిన దౌత్యవేత్తలు కూడా ఉన్నారు. ప్రత్యేక హోదా కోల్పోయిన ఆ రాష్ట్ర ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు, కష్టాలు పడుతున్నారు. 370 ఆర్టికల్ రద్దు తర్వాత దాదాపు జమ్ము కశ్మీర్ మొత్తం అనేక నిర్బంధాలను ఎదుర్కొంది. యావత్ ప్రపంచం దీనిపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలను పరిశీలించేందుకు, ప్రజాస్వామ్య వేడుకలో ప్రజలు ఏ విధంగా పాల్గొంటున్నారో తెలుసుకునేందుకు దౌత్యవేత్తలు జమ్మూ కశ్మీర్‌కు తరలివచ్చినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.

## గవర్నర్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడమా?

తమిళనాడు గవర్నర్ రవి చేసిన వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు మండి పడుతున్నాయి. అత్యున్నత స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఏమిటని నిలదీస్తున్నాయి. లౌకికతత్వం అనేది యూరోపియన్ భావన అని, అది భారత్‌కు చెందినది కాదని ఆయన ఒక సందర్భంగా అన్నారు. దీనిపై పలువురు రాజకీయ నేతలు స్పందించారు. తమిళనాడు వంటి ముఖ్యమైన రాష్ట్రానికి అలాంటి వ్యక్తిని నియమించడం సిగ్గుచేటని సిపిఐ(ఎం) నాయకురాలు బృందా కరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రవి వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అది ఆర్ఎస్ఎస్ అవగాహన అని అన్నారు. రాజ్యాంగం కూడా విదేశీ భావనేనని ఆయన రేపు అనవచ్చునని ఎత్తి పొడిచారు. రాజకీయాల నుంచి మతాన్ని వేరు చేయడం మన రాజ్యాంగంలో భాగమే. మన రాజ్యాంగం విదేశీ భావన అని రేపు ఆయన చెబుతారు. అది ఆర్ఎస్ఎస్ అవగాహన. తమిళనాడు వంటి ముఖ్యమైన రాష్ట్రానికి అలాంటి వ్యక్తిని గవర్నరుగా నియమించడం సిగ్గుచేటు' అని అన్నారు.

## వక్ఫ్ జేపీసీకి కోటి మెయిల్స్

వక్ఫ్ సవరణ బిల్లు - 2024 గురించి ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ప్రజల నుంచి భారీ స్పందన వచ్చిందని పార్లమెంటరీ వ్యవహారాలు, మైనారిటీ శాఖల మంత్రి కిరణ్ రిజుజు తెలిపారు. ఏకంగా 1.2 కోట్ల ఈ మెయిల్స్ వచ్చాయని వెల్లడించారు. 75000 మంది తమ వాదనలకు మద్దతుగా డాక్యుమెంట్లను కూడా పంపించారని తెలిపారు.

## బీజేపీపై రైతులకు నమ్మకం పోయింది

బీజేపీ సర్కారుపై హర్యానా రైతులకు, ప్రజలకు నమ్మకం పోయిందని కాంగ్రెస్ ఆరోపించింది. మూడు వ్యవసాయ సాగు చట్టాల రద్దు తర్వాత కేంద్రం ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించింది. రైతుల జీవనంపై బీజేపీకి ఉన్న విజన్ ఏమిటో వివరించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.'2021లో వ్యవసాయ సాగు చట్టాలు రద్దు చేసిన తర్వాత కేంద్రం రైతులకు ఇచ్చిన హామీలు ఎటు పోయాయి..? వారి డిమాండ్లు తీరుస్తామని ఎక్కడికి వెళ్లారు..? మోదీ సర్కారుపై హర్యానా రైతులు పూర్తిగా నమ్మకం కోల్పోయారు' అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరామ్ రమేశ్ విమర్శించారు.

## మతోన్మాద వ్యాఖ్యలు చేయకండి

భారత భూభాగంలోని ఏ ప్రాంతాన్నీ పాకిస్తాన్ అనలేమని, అలా అనడం రాజ్యాంగం ప్రకారం తప్పని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. మతోన్మాదం లేదా లింగ వివక్షను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని న్యాయమూర్తులకు సూచించింది. ఇటీవల కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి వి.శ్రీశానంద ఒక కేసు విచారణ సందర్భంగా బెంగళూరులో ముస్లింలు ఎక్కువగా వున్న ప్రాంతాన్ని పాకిస్తాన్‌గా ప్రస్తావించడాన్ని సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు పై వ్యాఖ్యలు చేసింది. వాదిస్తున్న కేసుకు సంబంధం లేని రీతిలో వివాదాస్పద వ్యాఖ్యలు చేయరాదని, రాజ్యాంగ విలువలకు కట్టుబడి వుండాలని న్యాయమూర్తులకు సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇటువంటి అనవసర వ్యాఖ్యలు చేయడం వల్ల ఆ న్యాయమూర్తులపై వ్యతిరేక అభిప్రాయాలు ఏర్పడడమే కాకుండా మొత్తంగా న్యాయ వ్యవస్థపైనే ప్రతికూల ప్రభావం పడుతుందని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. న్యాయమూర్తులు, లాయర్లు, కక్షిదారులు, ముఖ్యంగా పిటిషనర్లు అందరూ తమ భాష, వ్యవహార శైలిలో సంయమనం పాటించాల్సిన అవసరం వుందన్నారు. కోర్టులో వున్నవారే కాదని, బయటవున్న లక్షలాది మంది జనం కూడా తమను చూస్తారని వారు గ్రహించాలన్నారు.




## ఫలస్తీనాకు మా పూర్తి మద్దతు ఉంటుంది

పాలస్తీనా ప్రజలకు భారత్ మద్దతు, తోడ్పాటు పూర్తి స్థాయిలో వుంటుందని ప్రధాని నరేంద్ర మోడీ పునరుద్ఘాటించారు. న్యూయార్క్‌లో పాలస్తీనా అధ్యక్షుడు ముహమ్మద్ అబ్బాస్‌తో మోడీ భేటీ అయ్యారు. రాబోయే 12మాసాల కాలంలో ఆక్రమిత పాలస్తీనా భూభాగాల నుండి ఖాళీ చేయాలని ఇజ్రాయిల్‌ను కోరుతూ ఐక్యరాజ్య సమితి ఆమోదించిన తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ గైర్హాజరైంది. ఆ తరువాత కొద్ది రోజులకు ఈ సమావేశం చోటు చేసుకుంది. ఐక్యరాజ్య సమితిలో పాలస్తీనాకు భారత్ మద్దతు గురించి మోడీ చర్చించారని సమావేశానంతరం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రభుత్వం తెలిపింది. ఇజ్రాయిల్ పేరెత్తకుండా గాజాలో నెలకొన్న మానవతా సంక్షోభం పట్ల, మోడీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట తరుణంలో పాలస్తీనియన్లకు తమ పూర్తి మద్దతు వుంటుందని, మానవతా సాయం కూడా అందజేస్తామని మోడీ హామీ ఇచ్చారని తెలిపింది. రెండు దేశాల ఏర్పాటు మాత్రమే ఈ సంక్షోభాన్ని పరిష్కరించగలదని మోడీ పేర్కొన్నారు.

## చర్చల దశగా ఇస్రాయిల్- హిజ్బుల్లాహ్

ఇజ్రాయిల్- హిజ్బుల్లా మధ్య పోరు చినికిచినికి గాలివానగా మారక ముందే చర్చల దిశలో ముందడుగు పడింది. ఇటీవలి ఐక్యరాజ్య సమితి(ఐరాస) సర్వసభ్య సమావేశం సందర్భంగా అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ చేసిన చర్చలతో కాల్పుల విరమణ ప్రతిపాదనకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సానుకూలంగా స్పందించారు. అయితే ఇజ్రాయెల్-హమాస్ చర్చల్లో ఈజిప్ట్ వంటి దేశాలు మధ్యవర్తిత్వం నెరిపిన విషయం తెలిసిందే! ఇజ్రాయెల్-హిజ్బుల్లా విషయంలోనూ లెబనాన్ ప్రత్యక్షంగా మధ్యవర్తిత్వం నెరపాలని అమెరికా, ఐరోపా దేశాలు కోరుతున్నాయి. ఈ మేరకు రాయిటర్స్ ఓ కథనాన్ని ప్రచురించింది. ఈ చర్చలకు సంబంధించి, ఆరు ప్రధాన వర్గాలను ఉటంకించింది. “హిజ్బుల్లాతో చర్చల సందర్భంగా గాజాలోని బందీల విడుదల అంశాన్ని ఇజ్రాయెల్ లేవనెత్తే అవకాశాలున్నాయి. అదే సమయంలో గాజా, లెబనాన్‌లో ఉద్రిక్తతలను తగ్గించడానికి అమెరికా దృఢ సంకల్పంతో ఉంది. షరతులు-ప్రతి షరతులు లేకుండా ఈ చర్చలు సులభంగా సఫలమవ్వవని అమెరికా, ఫ్రాన్స్ భావిస్తున్నాయి. నిర్వాసితులు, శరణార్థుల కోణంలో రెండు దేశాలు ఆలోచిస్తున్నాయి” అని రాయిటర్స్ పేర్కొంది.

## నన్ను చంపేందుకు కుట్ర

తనను హత్య చేసేందుకు ఈరాన్ ప్రయత్నిస్తోందని అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. ఈ మేరకు యూఎస్ నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ కార్యాలయం నుంచి సమాచారం అందిందని ట్రంప్ జార్జియాలో ఓ ర్యాలీలో తెలిపారు. కొన్ని నెలలుగా ఈరాన్ ప్రయత్నాలు పెరిగినట్లు అధికారులు గుర్తించారని, తనను కాపాడేందుకు, ఈ ప్రభావం ఎన్నికలపై పడకుండా అధికారులు కృషి చేస్తున్నారని అన్నారు.

## శ్రీలంక అధ్యక్షుడిగా అనుర కుమార దిసనాయకే

శ్రీలంక తదుపరి అధ్యక్షుడిగా మార్క్సిస్ట్ నేత అనుర కుమార దిసనాయకే (56) ఎన్నికైన విషయం తెలిసిందే. తీవ్ర ఆర్థిక సంక్షోభంతో దివాలా అంచున ఉన్న శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో ఆయన ఘన విజయం సాధించారు. త్రిముఖ పోరులో ఓటర్లు అనుర కుమారకే పట్టం కట్టారు. దీంతో శ్రీలంక తదుపరి అధ్యక్షునిగా దిసనాయకే ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్ష కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో దిసనాయకేతో ప్రధాన న్యాయమూర్తి జయంత జయసూర్య ప్రమాణ స్వీకారం చేయించారు.

## ప్రపంచ నేతల భయాందోళనలు

మధ్య ప్రాచ్యంలో తాజా పరిణామాల పట్ల ప్రపంచ నేతలు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేశారు. వీటివల్ల అనూహ్యమైన పర్యవసానాలు తలెత్తే ప్రమాదముందని హెచ్చరించారు. తక్షణమే ఉద్రిక్తతలు సమసిపోయేందుకు చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. లెబనాన్, ఇజ్రాయిల్ మధ్య గల విభజన రేఖ బ్లూ లైన్ పొడవునా, ఆక్రమిత గోలన్ హైట్స్‌లో నెలకొన్న పరిస్థితుల పట్ల ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద సంఖ్యలో అమాయకులు మరణించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే దౌత్య మార్గాలకు మళ్ళాల్సిన అవసరం వుందని గుటెరస్ ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ పేర్కొన్నారు. పూర్తి స్థాయి యుద్ధాన్ని ప్రస్తుత తరుణంలో ఏ దేశమూ, ప్రజలు భరించలేరని అన్నారు. ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కార్యాలయం ప్రతినిధి రవీనా షామ్‌దాసాని మాట్లాడుతూ, పౌర లక్ష్యాలు, సైనిక లక్ష్యాల మధ్య తేడాను గుర్తించాలని అంతర్జాతీయ మానవతా చట్టాలు స్పష్టంగా చెబుతున్నాయని, కానీ వాటిని ఎక్కడా ఎవరూ పాటించడం లేదని ఆవేదన వ్యకం చేశారు. యునిసెఫ్ డైరెక్టర్ కేథరిన్ రౌసెల్ మాట్లాడుతూ ఈ ఘర్షణల్లో లెక్కలేనంత మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.

# ఏది నిజమైన ఆస్తి?

**అర్షియా**

**మనుషులు** తాము సంపాదించుకోవాల్సిన నిజమైన ఆస్తి గురించి, తమ సంతానానికి ఇవ్వాల్సిన నిజమైన ఆస్తి గురించి అల్లాహ్ ఖుర్ఆన్‌లో చెప్పాడు. అల్లాహ్ రెండు రకాల దాసులకు ఎంతో ధనాన్ని, సంతానాన్ని ప్రసాదిస్తాడని ప్రవక్త(స) తెలిపారు. అందులోని మొదటి రకం వారిని అల్లాహ్ ఇలా ప్రశ్నిస్తాడు, "ఓ ఆదమ్ కుమారుడా! నేను నీకు ఎంతో సంపదను, ధన రాశులను ప్రసాదించలేదా?". అందుకు అతను 'ప్రభూ! నీవు నాకు తప్పక ప్రసాదించావు" అని బదులిస్తాడు. "మరి ఆ సంపదను ఏమి చేసి వచ్చావు" అని అల్లాహ్ వారిని తిరిగి ప్రశ్నిస్తాడు. దానికి అతను "ఓ నా ప్రభూ! ఆ సంపదను నేను నా సంతానం దారిద్ర్యానికి లోను కాకూడదని వారికి వదలి వేసి వచ్చాను" అని బదులిస్తాడు. అప్పుడు విశ్వ ప్రభువు "నీకు ఇప్పటి వాస్తవం తెలిస్తే తక్కువ నవ్వుతావు. మరి ఎక్కువగా ఏడుస్తావు సుమా! నీవు ఏ విషయం (దారిద్ర్యం) గురించి నీ బిడ్డల పట్ల భీతి చెందుతూ ఉన్నావో అదే నేను వారికి అందజేశాను" అని వెల్లడిస్తాడు.

ఆ తరువాత మొదటి రకం వారిని ప్రశ్నించినట్టుగానే రెండో రకం దాసులను అల్లాహ్ ప్రశ్నిస్తాడు. దానికి వారు "ప్రభూ.. మేము నీ మార్గంలో నీవు ప్రసాదించిన ధనాన్ని ఖర్చు చేశాము. మా పిల్లలను నీ కారుణ్య ఛాయలో, నీ కృప నీడలో వదిలి వచ్చాము" అని బదులిస్తారు. అప్పుడు విశ్వప్రభువు, "వినండి! మీకు నేటి వాస్తవం తెలిస్తే ఎక్కువగా ఆనందిస్తారు. చాలా తక్కువ దుఃఖిస్తారు. మీరు మీ సంతానాన్ని ఏ స్థితిలో, ఏ నమ్మకంతో వదిలి వచ్చారో నేను వారిని దానికి పాత్రులుగా చేశాను" అని ప్రకటిస్తాడు.

మొదటి రకం దాసులు.. నా సంపద! నా సంపద! అంటూ ఆరాట పడుతుంటారు. అయితే వారి సంపద కేవలం మూడు విధాలుగానే ఉంటుంది. ఏదైతే వారు తిని జీర్ణం చేసుకున్నారో అది, ఏదైతే దుస్తులుగా తొడిగి చిరిగిపోయాయో అవి, ఏదైతే ఇతరులకు దానం చేసి ప్రళయ దినానికి భద్రపర్చుకున్నారో అది. మిగిలినదంతా ముగిసిపోయింది లేదా అతని చేజారిపోయింది.


ఇహ పరాల అవసరార్థం కాక, కేవలం వారసుల కోసం దాచి పెట్టబడే సంపద వాస్తవికతను ప్రవక్త(స) ఇలా స్పష్టం చేశారు, "మీ అవసరాల కోసం ఖర్చుపెట్టబడే సంపద కాక, మీ వారసుల కోసం దాచే సంపదను ప్రేమించేవారు మీలో ఎవరైనా ఉన్నారా?" అని ప్రశ్నించారు. అందుకు సహచరులు 'ఓ దైవప్రవక్తా! మేము మా మీద ఖర్చు పెట్టుకునే సంపదపైనే ఎక్కువ ప్రేమ కలిగి ఉంటాము' అన్నారు. అప్పుడు ప్రవక్త(స) "మీరు ఏదైతే అల్లాహ్ వద్దకు ముందస్తుగా (దానధర్మాల ద్వారా) పంపుకున్నారో ఆ సంపద మాత్రమే మీది. ఏదైతే మీరు వదలి వెళ్ళారో అది మీ వారసులది సుమా" అని తెలిపారు. (బుఖారీ)

ప్రవక్త(స) ఒక రోజున ఒక మేకను జిబహ్ చేశారు. దాని మాంసాన్ని దానం చేశారు. అప్పుడు ప్రవక్త(స), "అందులో ఏదైనా మిగిలి ఉందా?" అని సతీమణిని ప్రశ్నించారు. అందుకు ఆమె 'దాని ముందు కాలిలోని కొంత భాగం మిగిలి ఉంది' అని జవాబిచ్చారు. అప్పుడు ప్రవక్త(స) "అంతా పొదుపుకు గురైంది. ఒక్క ముందు కాలి భాగం మాత్రమే పొదుపుకు నోచుకోలేదు" అని అన్నారు. (తిర్మిజీ)

పై ప్రవచనం ఈ కింది అల్లాహ్ ఆదేశానికి అనుగుణంగా చెప్పబడింది: "మీ దగ్గరున్నదంతా ఖర్చు అయిపోయేదే. అల్లాహ్ వద్ద ఉన్నదే అసలు మిగిలి ఉండేది." (ఖుర్ఆన్, 16 : 96) '

'ఓ ఆదం కుమారుడా! నీ ఖజానాను అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టు. నా వద్ద (నీవు పంపిన) ఈ సంపద మునగనూ మునగదు. కాల్చబడి మసిగా మారదు. దొంగలించనూబడదు. (నా మార్గంలో) ఖర్చు చేయబడిన సంపదకు ప్రతిగా ఏది కోరినా అది నీకు ప్రసాదించబడుతుంది" అన్నారు ముహమ్మద్ ప్రవక్త (స)

**తుది గీటు**




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**